www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00



అగ్నివీరులకు గూడ్ న్యూస్ 2

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 85 | గురువారం | 5 నవంబర్, 2026



విష నురుగుతో విలవిల!

దేశ రాజధాని ఢిల్లీ మీదుగా ప్రవహించే యమునా నది.. నగరానికి కీలకమైన జల వనరుల్లో ఒకటి. అయితే పారిశ్రామిక వ్యర్థాలు, శుద్ధి చేయని మురుగునీరు నదిలో కలవడంతో ఏళ్లుగా కాలుష్య సమస్య తీవ్రంగా మారింది. ముఖ్యంగా చలికాలం ప్రారంభమయ్యే సమయంలో నదిలో తెల్లటి నురుగు పెద్దఎత్తున పేరుకుపోవడం కనిపిస్తోంది. మురుగునీటిలోని రసాయనాలు, డిటర్జెంట్ల ప్రభావంతో ఈ నురుగు ఏర్పడుతోంది. ఛఠ్ పూజ పండుగ సమీపిస్తుండటంతో అధికార యంత్రాంగం నురుగును తగ్గించేందుకు రసాయనాలను పిచికారీ చేయిస్తోంది. ఢిల్లీలోని కాళింది కుంజ్ ప్రాంతం వద్ద నదిపై పడవలో వెళ్లిన సిబ్బంది.. నురుగు తగ్గించేందుకు యాంటీ ఫోమింగ్ రసాయన ద్రావణాన్ని పిచికారీ చేశారు. ఛఠ్ పూజ సందర్భంగా భక్తులు యమునా నదిలో స్నానాలు చేసి, నీటిలో నిలబడి సూర్యభగవానుడికి అర్ఘ్యం సమర్పిస్తారు. ఈ నేపథ్యంలో నదిలో నురుగును తొలగించి, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడటంపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది.

– న్యూఢిల్లీ



సదర్ ఆత్మగౌరవానికి ప్రతీక

- రాష్ట్ర పండుగగా గుర్తించి రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నాం
- యాదవులకు అండగా ఉంటాం
- హైదరాబాద్ అభివృద్ధిలో వారిది కీలకపాత్ర
- ఎన్టీఆర్ స్టేడియంలో సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి

2



రెస్క్యూ బృందాలపై మృత్యుపంజా

- మత్స్యకారులను కాపాడేందుకు వెళ్లి 11మంది సిబ్బంది గల్లంతు

2

ట్రంప్‌కు ఓటర్ల షాక్!

మధ్యంతర ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ.. అమెరికా కాంగ్రెస్ డెమోక్రాట్ల వశం

- సెనేట్, ప్రతినిధుల సభ రెండింటినీ కైవసం చేసుకున్న ప్రతిపక్షం
- టెక్సాస్, జార్జియా, అయోవా, ఒహియోలో రిపబ్లికన్లకు పరాజయం
- కీలక గవర్నర్ పదవులనూ చేజిక్కించుకున్న డెమోక్రాట్లు
- ట్రంప్ విధానాలపై ప్రజాగ్రహమే ఓటమికి కారణం
- ఫలితాలను అంగీకరిస్తున్నట్లు ప్రకటన



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మధ్యంతర ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన నేతృత్వంలోని రిపబ్లికన్ పార్టీకి ఓటర్లు షాక్ ఇచ్చారు. ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ అమెరికా కాంగ్రెస్‌లోని ఉభయ సభలైన సెనేట్, ప్రతినిధుల సభపై పట్టు సాధించింది. కీలక రాష్ట్రాల్లో గవర్నర్ పదవులనూ కైవసం చేసుకుంది. రిపబ్లికన్లకు బలమైన పట్టున్న టెక్సాస్, జార్జియా, అయోవా, ఒహియో వంటి రాష్ట్రాల్లోనూ డెమోక్రాట్లు విజయదుందుభి మోగించారు. ట్రంప్ విధానాలపై ప్రజల్లో పెరిగిన అసంతృప్తి ఈ ఫలితాల్లో స్పష్టంగా కనిపించింది. అమెరికా సెనేట్‌లో గతంలో రిపబ్లికన్లకు 53–47 మెజారిటీ ఉండేది. తాజా ఎన్నికల్లో కనీసం ఏడు రిపబ్లికన్ స్థానాలను డెమోక్రాట్లు గెలుచుకుని సెనేట్‌ను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. నార్త్ కరోలినా, ఒహియో, మైనే, సౌత్ కరోలినా, కాన్సాస్, అయోవా, టెక్సాస్‌లలో విజయాలు సాధించారు. దాదాపు 40ఏళ్ల తర్వాత టెక్సాస్ నుంచి డెమోక్రటిక్ పార్టీకి చెందిన జేమ్స్ తలారికో సెనేట్‌కు ఎన్నికయ్యారు. రిపబ్లికన్ నేత కెన్ పాక్స్టన్‌ను ఆయన ఓడించారు. ప్రతినిధుల సభలోనూ డెమోక్రాట్లు 218 స్థానాల మ్యాజిక్ ఫిగర్‌ను దాటి ఆధిక్యం సాధించారు. గతంలో రిపబ్లికన్లకు 220–215తో స్వల్ప మెజారిటీ ఉండేది. ట్రంప్ 2024లో రెండంకెల ఆధిక్యంతో గెలిచిన నియోజకవర్గాల్లోనూ డెమోక్రాట్లు పాగా వేయడం విశేషం. గవర్నర్ ఎన్నికల్లోనూ డెమోక్రాట్లు సత్తా చాటారు. జార్జియాలో కీషా లాన్స్ బాటమ్స్ విజయం సాధించి, ఆ రాష్ట్ర తొలి నల్లజాతి మహిళా గవర్నర్‌గా చరిత్ర సృష్టించారు. అయోవాలో రాబ్ సాండ్ గెలుపొందారు. టెక్సాస్‌లో ప్రస్తుత గవర్నర్ గ్రెగ్ అబాట్‌ను ఓడించిన గినా హినోజోసా.. ఆ రాష్ట్రంలో గవర్నర్‌గా ఎన్నికైన తొలి లాటినా మహిళగా రికార్డు నెలకొల్పారు. ఒహియో గవర్నర్ ఎన్నికల్లో ట్రంప్ మద్దతుతో పోటీ చేసిన భారత సంతతి నేత వివేక్ రామస్వామి.. డెమోక్రటిక్ అభ్యర్థి అమీ ఆక్టన్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఈ ఎన్నికల ప్రచారం రిపబ్లికన్ పార్టీలోనూ విభేదాలకు దారితీసింది.

ట్రంప్ విధానాలపై ప్రజాగ్రహం

ఇరాన్‌తో యుద్ధం, పెరుగుతున్న జీవన వ్యయాలు సహా ట్రంప్ విధానాలపై ప్రజల్లో అసంతృప్తి ఎన్నికల ఫలితాలపై తరువాయి 2లో..



ట్రంప్‌కు ఓటర్ల షాక్!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభావం చూపినట్లు విశ్లేషణలు వెలువడ్డాయి. ట్రంప్ అబద్దాలు, గొప్పలు చెప్పుకోవడం నచ్చకే ఆయన పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసినట్లు పలువురు ఓటర్లు పీటీఐతో పేర్కొన్నారు. అసోసియేటెడ్ ప్రెస్ నిర్వహించిన సర్వేలో దాదాపు 60 శాతం మంది ట్రంప్ పనితీరును వ్యతిరేకించారు. అధ్యక్షుడి అధికారాలపై కాంగ్రెస్ మరింత నియంత్రణ విధించాలని 70 శాతం మంది కోరుకున్నారు. ఎన్నికల్లో ఓటమిని ట్రంప్ అంగీకరించారు. డెమోక్రాట్లకు అభినందనలు తెలుపుతూ.. దేశ ప్రయోజనాల కోసం వారితో కలిసి పనిచేస్తానని ప్రకటించారు. ఫలితాలను పూర్తిగా అంగీకరిస్తున్నట్లు న్యూయార్క్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. అయితే, తాను అభ్యర్థిగా బరిలో లేకపోవడమే పార్టీ ఓటమికి కారణమని వ్యాఖ్యానించారు. తాను పోటీ చేసి ఉంటే రిపబ్లికన్లు భారీ మెజారిటీతో గెలిచేవారని సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

అధ్యక్షుడి అధికారాలకు కళ్లెం

కాంగ్రెస్‌లో డెమోక్రాట్ల ఆధిపత్యం పెరగడంతో ట్రంప్ తన ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకోవడం ఇకపై అంత సులభం కాకపోవచ్చు. అధ్యక్షుడి విధానాలను అడ్డుకునే అధికారం కాంగ్రెస్‌కు ఉండటంతో ఆయనకు రాజకీయంగా సవాళ్లు ఎదురుకానున్నాయి. మిగిలిన పదవీకాలంలో కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా నిర్ణయాలు తీసుకోవడం లేదా కాంగ్రెస్ ఆమోదించిన బిల్లులపై వీటో ప్రయోగించడం వంటి మార్గాలే ట్రంప్‌కు మిగిలే అవకాశముంది. ఈ నేపథ్యంలో 'వీటో' అని రాసి ఉన్న ఎర్ర టోపీ చిత్రాన్ని ట్రంప్ తన సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

కీలక ఖనిజాల ప్రాసెసింగ్‌లో స్వావలంబన దిశగా భారత్

- రూ.2,814 కోట్లతో కేంద్రం కొత్త పథకం
- లిథియం, నికెల్, కోబాల్ట్ శుద్ధికి దేశీయ ప్లాంట్లు
- పెట్టుబడులను ప్రోత్సహించేందుకు మూలధన రాయితీలు
- విదేశీ సరఫరా వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించడమే లక్ష్యం

న్యూఢిల్లీ: భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానానికి కీలకమైన ఖనిజాల ప్రాసెసింగ్‌లో విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించి, దేశీయ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రూ.2,814 కోట్ల వ్యయంతో రూపొందించిన మూలధన సహాయ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం వెల్లడించారు. లిథియం, నికెల్, కోబాల్ట్ వంటి ఖనిజాలు ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్, రక్షణ రంగాలకు అత్యంత అవసరమని మోదీ పేర్కొన్నారు. అయితే శుద్ధి చేసిన ఖనిజాల కోసం భారత్ ఇప్పటికీ అధికంగా దిగుమతులపైనే ఆధారపడుతోందని తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా దేశంలోనే వీటి ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కొత్త ప్లాంట్లు.. పెట్టుబడులకు ప్రోత్సాహం

ఈ పథకం ద్వారా కీలక ఖనిజాల ప్రాసెసింగ్ కోసం కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం లభించనుంది. పెట్టుబడులను ఆకర్షించేందుకు మూలధన రాయితీలు కల్పించనున్నారు. దేశీయంగా విలువ జోడింపును పెంచడంతోపాటు, సరఫరా వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం పథకం ప్రధాన ఉద్దేశమని మోదీ వివరించారు. ప్రస్తుతం కీలక ఖనిజాల ప్రాసెసింగ్ ప్రపంచంలోని కొద్ది ప్రాంతాలకే పరిమితమై ఉందని కేంద్రం పేర్కొంది. దీంతో భౌగోళిక రాజకీయ పరిణామాలు, ధరల్లో హెచ్చుతగ్గులు, సరఫరాపై అంక్షలు వంటి కారణాలతో అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఇది దేశ ఆర్థిక భద్రత, జాతీయ భద్రత, ఆర్థిక స్వావలంబనపై ప్రభావం చూపుతుందని వివరించింది. కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలను సకాలంలో సాధించేందుకు కూడా కీలక ఖనిజాల నిరంతర సరఫరా అవసరమని కేంద్రం అభిప్రాయపడింది. భవిష్యత్తు సాంకేతికతలను దేశంలోనే అభివృద్ధి చేసుకునే సామర్థ్యాన్ని భారత్ పెంచుకోవాలని మోదీ స్పష్టం చేశారు.

రెస్క్యూ బృందాలపై మృత్యుపంజా

- మత్స్యకారులను కాపాడేందుకు వెళ్లి ప్రమాదంలో చిక్కుకున్న సిబ్బంది
- బేతుపల్లి చెరువులో రెండు పడవలు బోల్తా
- 11మంది ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గల్లంతు
- ముగ్గురు మత్స్యకారులకు మాత్రమే దక్కిన రక్షణ
- ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో ముమ్మరంగా గాలింపు
- పరిస్థితిని సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి

ప్రజానావ, ఖమ్మం: ఆపదలో ఉన్నవారిని కాపాడేందు కు వెళ్లిన వారే ప్రమాదంలో చిక్కుకున్న విషాద ఘటన ఖమ్మం జిల్లాలో చోటుచేసుకుంది. సత్తుపల్లి సమీపంలోని బేతుపల్లి చెరువులో మత్స్యకారులను రక్షించే క్రమంలో రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్), అగ్నిమాపక శాఖ సిబ్బంది గల్లంతయ్యారు. మురసు తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులో నీటి ప్రవాహం ఉధృతంగా మారింది. ఈ పరిస్థితుల్లో సహాయక చర్యలకు వెళ్లిన రెండు పడవలు నీటి ఉధృతికి బోల్తాపడటంతో వాటిలో ఉన్న 11 మంది సిబ్బంది గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం అధికారులు విస్తృతంగా గాలిస్తున్నారు. బేతుపల్లి చెరువులో ఎనిమిది మంది మత్స్యకారులు చిక్కుకున్నట్లు సమాచారం అందడంతో వారిని రక్షించేందుకు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. తొలుత ముగ్గురు మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చాయి. మిగిలిన ఐదుగురిని బయటకు తీసుకొచ్చేందుకు మరోసారి పడవల్లో చెరువులోకి వెళ్లిన సిబ్బందికి ప్రమాదం ఎదురైంది. నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో రెండు పడవలు అదుపుతప్పి బోల్తాపడ్డాయి. దీంతో వాటిలో ఉన్న 11 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది నీటిలో గల్లంతయ్యారు. చెరువులో ఏర్పడిన సుడిగుండాలు, ఉధృతమైన ప్రవాహమే ప్రమాదాని



కి కారణమై ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

డ్రోన్లతోనూ గాలింపు

సిబ్బంది గల్లంతైన విషయం తెలియగానే జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. మరో పడవ సాయంతో ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కూడా గాలింపు కొనసాగిస్తున్నారు. అదనపు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతోపాటు అనుభవజ్ఞులైన ఈతగాళ్లను రంగంలోకి దించారు. డ్రోన్ల ద్వారా చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. తీరంలో అంబులెన్సులు, అత్యవసర వైద్య సదుపాయాలను సిద్ధంగా ఉంచారు. చీకటి పడటం, చెరువులో వరద ప్రవాహం తీవ్రంగా ఉండటంతో గాలింపు చర్యలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గల్లంతైన సిబ్బంది, చెరువులో ఇంకా చిక్కుకున్న ఐదుగురు మత్స్యకారుల ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళన నెలకొంది. బాధిత కుటుంబ సభ్యులు చెరువు వద్దకు చేరుకొని విలపిస్తున్నారు.

సహాయక చర్యలపై ముఖ్యమంత్రి ఆరా

ఘటనపై సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు ఉన్నతాధికారులు బేతుపల్లి చెరువు వద్దకు చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. గల్లంతైన సిబ్బంది, మత్స్యకారులను గుర్తించి సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఘటనపై ఆరా తీశారు. గల్లంతైన ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఆచూకీ కోసం గాలింపును వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సహాయక చర్యల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. ప్రస్తుతం బేతుపల్లి చెరువు వద్ద గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

సదర్ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక

- యాదవులకు అండగా ఉంటాం
- రాష్ట్ర పండుగగా గుర్తించి రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నాం
- హైదరాబాద్ అభివృద్ధిలో యాదవులది కీలకపాత్ర
- ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజానావ, హైదరాబాద్: సదర్ సమ్మేళనం యాదవులకే పరిమితమైన వేడుక కాదని, తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవానికి ప్రతీక అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. యాదవుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు తెలంగాణ సమాజంలో విడదీయలేని భాగమని, హైదరాబాద్ నగర అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. యాదవుల ఆత్మగౌరవానికి ఎక్కడా భంగం కలగకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీకృష్ణ సదర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యాదవుల విజ్ఞప్తి మేరకు సదర్ సమ్మేళనానికి రాష్ట్ర పండుగ హోదా కల్పించి తగిన గుర్తింపు ఇచ్చామని సీఎం తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాలనే ఆలోచన చేయలేదన్నారు. హైదరాబాద్‌కు యాదవుల చరిత్రతో విడదీయలేని అనుబంధం ఉందని, గోల్కొండ కోటను ఒకప్పుడు గొల్లకొండగా పిలిచేవారని గుర్తుచేశారు. గోల్కొండ నిర్మాణంతోపాటు హైదరాబాద్ నగర అభివృద్ధిలోనూ యాదవుల పాత్ర విశిష్టమైనదని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఆదరిస్తూ నగర ప్రగతిలో భాగస్వాములయ్యారని చెప్పారు. సదర్ సమ్మేళనం హైదరాబాద్ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెబుతోందన్నారు.



యాదవులకు ప్రాధాన్యం

తమ ప్రభుత్వం యాదవులకు రాజకీయంగా, సామాజికంగా తగిన ప్రాధాన్యం కల్పించిందని రేవంత్‌రెడ్డి వివరించారు. అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్‌కుమార్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని, ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలిగా నియమించామని గుర్తుచేశారు. యాదగిరిగుట్ట గోశాలలో గోసంరక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో యాదవులకు దక్కాల్సిన వాటా దక్కేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కులగణన నిర్వహించడం ద్వారా సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పనకు మార్గం సుగమం చేశామని చెప్పారు. అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. హైదరాబాద్ అభివృద్ధితోపాటు మూసీ పునరుజ్జీవనం, మెట్రో రైలు విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లాల్సి ఉందని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, అభివృద్ధి కార్యక్రమాల్లో యాదవులు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

పశుసంపద అభివృద్ధి ఎంతో కీలకం: భట్టి

సదర్ ఉత్సవాలను ఏటా మరింత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామిగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి పశుసంపద అభివృద్ధి ఎంతో కీలకమని పేర్కొన్నారు. పశుసంపదను పరిరక్షించి, మరింత అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సదర్ ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు కృషి చేస్తున్న అంజన్‌కుమార్ యాదవ్, ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఆర్జేడీ నేత, బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ మధ్య ఉన్న స్నేహం దేశానికి ఎంతో అవసరమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. తేజస్వీ యాదవ్ ముఖంలో రాహుల్‌గాంధీ కనిపిస్తున్నారని, ఇద్దరూ కవల సోదరుల్లా ఉన్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పాలన సాగుతున్నట్లే, బిహార్‌లో తేజస్వీ యాదవ్ రూపంలో మరో యువ ముఖ్యమంత్రిని చూడాలని ఆకాంక్షించారు. సదర్ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలతోపాటు యాదవుల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌కుమార్ యాదవ్‌తోపాటు పలువురు యాదవ ప్రముఖులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అగ్నివీరులకు గూడ్ న్యూస్

- ఆరేళ్ల సర్వీసు.. ఆపై శాశ్వత ఉద్యోగం
- పథకంలో కీలక మార్పులు చేసిన కేంద్రం
- నాలుగేళ్ల సేవ తర్వాత 75శాతం మందికి మరో రెండేళ్ల అవకాశం
- అర్హత, ఆసక్తి ఉన్నవారికి సాయుధ బలగాల్లో శాశ్వత నియామకం
- అగ్నిపథ్ కొనసాగుతుంది: రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- రక్షణ రంగంలో దీర్ఘకాలిక సంస్కరణలని వెల్లడి



న్యూఢిల్లీ: అగ్నిపథ్ సైనిక నియామక పథకంలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకుని బయటకు వెళ్లాల్సిన అగ్నివీరుల్లో మిగిలిన 75 శాతం మందికి మరో రెండేళ్లు సైన్యంలో కొనసాగే అవకాశం కల్పించింది. ఈ అదనపు సేవాకాలం పూర్తయ్యాక నిర్దేశిత అర్హతలు సాధించి, సర్వీసులో కొనసాగేందుకు ఆసక్తి చూపేవారిని శాశ్వత ప్రాతిపదికన సాయుధ బలగాల్లో నియమించనుంది. త్రివిధ దళాల సిఫారసుల మేరకు కేంద్ర మంత్రివర్గం ఈ మార్పులకు ఆమోదం తెలిపింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ నిర్ణయాన్ని దీర్ఘకాలిక నిర్మాణాత్మక సంస్కరణల్లో భాగంగా అభివర్ణించారు. యువ, దృఢమైన, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన భవిష్యత్తు సైన్యాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.

అందరికీ సైన్యంలో కొనసాగే అవకాశం

చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ ఎన్.ఎస్.రాజా సుబ్రమణి బుధవారం ఈ వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం అగ్నిపథ్ పథకం కింద నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారిలో ప్రతిభ ఆధారంగా 25 శాతం మందిని మాత్రమే సాధారణ సైనిక సర్వీసులోకి తీసుకుంటున్నారు. మిగిలిన 75 శాతం మంది బయటకు వెళ్లాల్సి వస్తోంది. తాజా మార్పులతో ఆ 75 శాతం మందికి మరో రెండేళ్లపాటు సైన్యంలో పనిచేసే అవకాశం లభిస్తుందని సీడీఎస్ తెలిపారు. ఆ తర్వాత ఎంపిక ప్రమాణాలు అందుకుని, వ్యక్తిగతంగా ఆసక్తి చూపేవారిని సాధారణ సైనిక విభాగాల్లోకి తీసుకుంటామని చెప్పారు. దీంతో అగ్నివీరుల్లో దాదాపు అందరికీ సైన్యంలో కొనసాగేందుకు మార్గం ఏర్పడిందన్నారు.

యథాతథంగా కొనసాగింపు

అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయడం లేదని, అది కొనసాగుతుందని స్పష్టం చేశారు. తొలి నాలుగేళ్ల సర్వీసు పూర్తయ్యాక ఎంపికైన 25 శాతం మందికి సీనియారిటీ విషయంలో ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. రెండేళ్ల అదనపు సేవ అనంతరం శాశ్వత నియామకం పొందేవారు వారి తర్వాతి స్థానంలో ఉంటారని వివరించారు. రెండో విడత సేవా అవకాశం వల్ల తొలి దశలో ఎంపిక కానివారికి సైన్యంలో మరికొంతకాలం పనిచేసే అవకాశం లభిస్తుందని చెప్పారు.

2022లో పథకం ప్రారంభం

త్రివిధ దళాల్లో యువత ప్రాతినిధ్యాన్ని పెంచి, సైనికుల సగటు వయసును తగ్గించాలనే లక్ష్యంతో కేంద్రం 2022 జూన్‌లో అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. 17.5 నుంచి 21 ఏళ్ల మధ్య వయసున్న యువతను నాలుగేళ్ల కాలపరిమితితో నియమించే విధానాన్ని తీసుకొచ్చింది. ప్రతి బ్యాచ్‌లో 25 శాతం మందిని మాత్రమే 15 ఏళ్లపాటు సాధారణ సర్వీసులో కొనసాగించే నిబంధన పెట్టింది. మిగిలిన 75శాతం మంది భవిష్యత్తుపై అప్పట్లో ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. వారి ఉపాధి భద్రతపై ప్రశ్నలు లేవనెత్తాయి. ఈ నేపథ్యంలో తాజా మార్పులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రస్తుతం అగ్నిపథ్ పథకం కింద నియమితులైన మూడు లక్షల మందికి పైగా సైనికులు వివిధ విభాగాల్లో సేవలందిస్తున్నారు. నాలుగేళ్ల తర్వాత బయటకు వచ్చే అగ్నివీరుల కోసం కేంద్ర ప్రభుత్వంలోని పలు శాఖలు, విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ప్రత్యేక నియామక అవకాశాలను ప్రకటించాయి. తాజా మార్పుల నేపథ్యంలో అలాంటి ఏర్పాట్లు ఇక అవసరం ఉండకపోవచ్చని సీడీఎస్ అభిప్రాయపడ్డారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ రెండేళ్ల అదనపు సేవాకాలాన్ని 'సెకండ్ టూర్ ఆఫ్ డ్యూటీ'గా పేర్కొన్నారు. నాలుగు లేదా ఆరేళ్ల సేవ అనంతరం అర్హతలు కలిగి, ఆసక్తి చూపే అగ్నివీరులందరికీ సాధారణ సైనికులుగా చేరే అవకాశం కల్పించడమే ఉద్దేశమని తెలిపారు. మారుతున్న యుద్ధతంత్రాలకు అనుగుణంగా సైన్యాన్ని సిద్ధం చేయడంలో కీలక ముందడుగు అని పేర్కొన్నారు.



జ్వెరెవ్‌కు షాక్!

- నంబర్‌వన్ హోదాలో తొలి ఓటమి
- పారిస్ మాస్టర్స్‌లో ముసెట్టీ చేతిలో రెండో రౌండ్‌లోనే పరాజయం
- ఇటీవలి నెలల్లో ఇదే నా చెత్త ప్రదర్శన: జ్వెరెవ్

పారిస్: పురుషుల టెన్నిస్ ప్రపంచ నంబర్‌వన్‌గా బాధ్యతలు చేపట్టిన అలెగ్జాండర్ జ్వెరెవ్‌కు తొలి మ్యాచ్‌లోనే చేదు అనుభవం ఎదురైంది. పారిస్ మాస్టర్స్ రెండో రౌండ్‌లో ఇటలీ ఆటగాడు లోరెంజో ముసెట్టీ చేతిలో 7–6 (5), 6–2తో పరాజయం పాలయ్యాడు. తన ఆటతీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన జ్వెరెవ్.. గత కొన్ని నెలల్లో ఇదే అత్యంత చెత్త ప్రదర్శనల్లో ఒకటని వ్యాఖ్యానించాడు. వేగంగా ఉండే కోర్టు తన దూకుడైన ఆటతీరుకు అనుకూలమైనప్పటికీ మెరుగ్గా ఆడలేకపోయానని జ్వెరెవ్ తెలిపాడు. ప్రపంచ నంబర్‌వన్ హోదా ప్రతి ఆటగాడి కల అని, అయితే తాను ఆ స్థానానికి అర్హుడినని పదేపదే నిరూపించుకోవాల్సి వస్తోందని అసహనం వ్యక్తం చేశాడు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, యూఎస్ ఓపెన్ టైటిళ్లు గెలుచుకున్న 29 ఏళ్ల జ్వెరెవ్.. సోమవారం అగ్రస్థానానికి చేరుకున్నాడు.

ఫైనల్స్ బెర్తుపై జొకోవిచ్ గురి

ముసెట్టీ 29 విన్నర్లు కొట్టగా, జ్వెరెవ్ 25కే పరిమితమయ్యాడు. అనవసర తప్పిదాలు కూడా జ్వెరెవ్ ఓటమికి కారణమయ్యాయి. మరోవైపు, ఫ్రాన్సిస్ టియాఫో నాలుగు మ్యాచ్ పాయింట్లు చేజార్చుకుని క్వెంటిన్ హాలిస్ చేతిలో ఓడాడు. ఈ ఫలితంతో ఆర్థర్ ఫిల్స్ ఏటీపీ ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. 2016లో గేల్ మోన్ ఫిల్స్ తర్వాత ఈ టోర్నీకి అర్హత పొందిన తొలి ఫ్రెంచ్ ఆటగాడిగా నిలిచాడు. మరో మ్యాచ్‌లో డానిల్ మెద్వెదెవ్ కూడా ఇగ్నాసియో బుసే చేతిలో ఓటమి చవిచూశాడు. 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత నొవాక్ జొకోవిచ్ పారిస్ మాస్టర్స్‌లో సెమీఫైనల్ చేరితేనే ఈ నెలలో జరిగే ఏటీపీ ఫైనల్స్‌కు అర్హత సాధించే అవకాశం ఉంటుంది. నవంబర్ 15 నుంచి 22 వరకు టూరిన్‌లో ఈ పోటీలు జరగనున్నాయి.



ధర తగ్గింది.. కళ పెరిగింది

ధన త్రయోదశికి నగల మార్కెట్‌లో కొత్త జోష్

- అమ్మకాల పరిమాణం యథాతథం
- విలువలో 20–30 శాతం వృద్ధి అంచనా
- తేలికపాటి ఆభరణాలు, వెండి నగలకు పెరగనున్న గిరాకీ
- పెళ్లిళ్ల కోసం ముందస్తు కొనుగోళ్లకు మొగ్గు

ముంబై: బంగారం ధరలు ఇటీవల గణనీయంగా తగ్గడంతో ఈ ఏడాది ధన త్రయోదశి అమ్మకాలపై నగల వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు. ధరల తగ్గుదల వినియోగదారుల్లో కొనుగోలు ఆసక్తిని పెంచుతోందని, తేలికపాటి ఆభరణాలు, తక్కువ ధరలో లభించే నగలు, బంగారు నాణేలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే గతేడాదితో పోలిస్తే విక్రయాల పరిమాణం దాదాపు స్థిరంగానే ఉండవచ్చని, అమ్మకాల విలువ మాత్రం 20–30 శాతం పెరగవచ్చని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అఖిల భారత రత్నాలు, ఆభరణాల దేశీయ మండలి (జీజేసీ) ఛైర్మన్ రాజేశ్ రోక్డే మాట్లాడుతూ.. ఈ ఏడాది నవంబరు 6న ధన త్రయోదశి రావడం కూడా కొనుగోళ్లకు కలిసొచ్చే అంశమన్నారు. నెల ప్రారంభంలోనే పండుగ ఉండటంతో చాలామంది చేతిలో జీతాలు ఉంటాయని, ఖర్చు చేసేందుకు ఆసక్తి చూపుతారని పేర్కొన్నారు. మే 29న 10 గ్రాముల బంగారం ధర రూ.1,62,900 ఉండగా.. అక్టోబరు 31 నాటికి రూ.20,900 (12.8 శాతం) తగ్గి రూ.1.42 లక్షలకు చేరిందని తెలిపారు. బుధవారం ధర రూ.1,46,600గా ఉంది. గతేడాది ఇదే సమయంలో 10 గ్రాముల బంగారం సుమారు రూ.1.10 లక్షలుగా ఉండేది. ధరలు తగ్గడంతో తేలికపాటి నగలు, వెండి ఆభరణాలు, నాణేల కొనుగోళ్లపై ఆసక్తి పెరుగుతోందన్నారు.

వెండిపైనా యువత ఆసక్తి

వెండి ధర తక్కువగా ఉండటంతో యువత ఎక్కువగా ఆకర్షితులవుతోందని రోక్డే చెప్పారు. వివిధ దుస్తులకు సరిపోయేలా వెండిలో విస్తృతమైన డిజైన్లు అందుబాటులో ఉండటం కూడా ఇందుకు కారణమన్నారు. వెండి అమ్మకాల పరిమాణం గతేడాది స్థాయిలోనే ఉండవచ్చని, విలువ పరంగా 30 శాతం వృద్ధి నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. జీజేసీ ఉపాధ్యక్షుడు అవినాశ్ గుప్తా కూడా ఈ పండుగ సీజన్‌లో నగల అమ్మకాల విలువ 15–20 శాతం పెరగవచ్చన్నారు. బంగారం, వెండి ధరల పెరుగుదలతో గత ఆరు నెలలుగా మార్కెట్ మందగించిందని, తాజా ధరల తగ్గుదలతో కొనుగోలుదారుల్లో మళ్లీ ఉత్సాహం కనిపిస్తోందని చెప్పారు. పెళ్లి నగల్లోనూ 18 క్యారెట్ల బంగారానికి ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. వెండి ధరలు దాదాపు 50 శాతం తగ్గడంతో ఈ విభాగంలో అమ్మకాల పరిమాణం 10 శాతం పెరగవచ్చని పేర్కొన్నారు.

పెళ్లిళ్ల కొనుగోళ్లు ముందుగానే..

రానున్న మూడు నుంచి ఆరు నెలల్లో పెళ్లిళ్లు చేసుకోనున్న కుటుంబాలు ధరలు ఆకర్షణీయంగా ఉండటంతో ముందుగానే బంగారం కొనుగోలు చేసే అవకాశం ఉందని ప్రపంచ స్వర్ణ మండలి భారత ప్రాంతీయ సీఈఓ సచిన్ జైన్ తెలిపారు. ఖరీదైన ఆభరణాల నుంచి పెట్టుబడి కోసం కొనుగోలు చేసే బంగారు నాణేలు, కడ్డీల వరకు అన్ని విభాగాల్లోనూ డిమాండ్ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సెన్కో గోల్డ్ ఎండీ, సీఈఓ సువాంకర్ సేన్ మాట్లాడుతూ.. ఈ పండుగ సీజన్‌లో తమ సంస్థ అమ్మకాలు గతేడాదితో పోలిస్తే 20 శాతానికి పైగా పెరుగుతాయని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. వజ్రాభరణాల విక్రయాల్లోనూ 25–30 శాతం వృద్ధి కనిపిస్తోందన్నారు.



తేలికపాటి నగలవైపు మొగ్గు

బంగారం ధరలు పెరగడం, రూపాయి–డాలర్ మారకపు విలువలో మార్పుల నేపథ్యంలో వినియోగదారులు 9 నుంచి 19 క్యారెట్ల శ్రేణిలో తేలికపాటి, రాళ్లు పొదిగిన ఆభరణాలపై ఆసక్తి చూపుతున్నారని కామా జ్యువెలరీ వ్యవస్థాపకుడు కోలిన్ షా తెలిపారు. రూ.1.5 లక్షల నుంచి రూ.3 లక్షల మధ్య ధర కలిగిన ల్యాబ్ గ్రోన్, సహజ వజ్రాభరణాలకు డిమాండ్ పెరుగుతోందన్నారు. అయితే అమ్మకాల విలువ గతేడాది స్థాయిలో ఉండవచ్చని, పరిమాణం మాత్రం సుమారు 10శాతం తగ్గే అవకాశం ఉందని అంచనా వేశారు. మొత్తంగా ఈ సీజన్‌లో పెళ్లిళ్లు, పెట్టుబడుల కోసం బంగారం, వెండి రెండింటినీ కొనుగోలు చేసే ధోరణి కనిపిస్తోందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.





- ఇంధన ధరల సెగ..

స్టార్ ఎయిర్ విమాన సర్వీసులకు కోత!

- వారానికి 15–20 శాతం తగ్గిన విమాన సర్వీసులు
- ప్రస్తుతం వారానికి 52 విమానాలే నిర్వహణ
- ప్రాంతీయ విమానయాన సంస్థలకు ప్రత్యేక ఇంధన ధరల విధానం కోరిన యాజమాన్యం
- నిర్వహణ వ్యయంలో 40శాతం ఏటీఎఫ్ ఖర్చులే

న్యూఢిల్లీ: విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలు భారీగా పెరగడంతో ప్రాంతీయ విమానయాన సంస్థ స్టార్ ఎయిర్ తన సర్వీసులకు కోత విధించింది. ప్రస్తుత శీతాకాల షెడ్యూల్‌లో వారానికి నిర్వహించే విమానాల సంఖ్యను 15–20 శాతం తగ్గించి 52కు పరిమితం చేసింది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో ఇంధన ధరలు పెరగడం నిర్వహణ వ్యయాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని సంస్థకు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించారు.

ప్రత్యేక ధరల విధానం కావాలి

పెరుగుతున్న ఏటీఎఫ్ ధరల భారాన్ని ప్రాంతీయ విమానయాన సంస్థలు ప్రయాణికులపైకి బదిలీ చేసే పరిస్థితి లేదని ఆ అధికారి తెలిపారు. అందువల్ల ప్రాంతీయ విమానయాన సంస్థల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఇంధన ధరల విధానాన్ని తీసుకురావాలని కోరారు. మొత్తం ఏటీఎఫ్ వినియోగంలో ప్రాంతీయ విమానయాన సంస్థల వాటా కేవలం 3 శాతమేనని, వీటికి అనుకూల నిబంధనలతో ధరల స్థిరీకరణ నిధి (పీఎస్ఎఫ్) ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఉడాన్ వంటి ప్రాంతీయ కనెక్టివిటీ పథకాల కింద నిర్దిష్ట మార్గాల్లో సర్వీసులు నడిపే సంస్థలకు ప్రత్యేక ధరలు నిర్ణయించాలని సూచించారు.

గతంలో అమలైన పథకం నిలిపివేత

అధిక ఇంధన ధరలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విమానయాన సంస్థలకు ఊరటనిచ్చేందుకు ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభంలో పీఎస్ఎఫ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ప్రస్తుతం ఆ పథకం గడువు ముగియగా, తిరిగి అమలు చేయడంపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. విమానయాన సంస్థల మొత్తం నిర్వహణ వ్యయంలో ఏటీఎఫ్ ఖర్చుల వాటా సుమారు 40 శాతంగా ఉంటుందని అధికారి వివరించారు. ప్రస్తుతం ఎనిమిది ఎంబ్రేయర్ ప్రాంతీయ విమానాలను కలిగిన స్టార్ ఎయిర్.. ధరల భారాన్ని తగ్గించుకునేందుకు సర్వీసులను కుదించాల్సి వచ్చిందని తెలిపారు.

పట్టభద్రుల ఓటుతోనే రాష్ట్ర భవిష్యత్తుకు దిశ

- అర్హులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జూటూరు కీర్తిరెడ్డి పిలుపు

ప్రజానావ, హైదరాబాద్: పట్టభద్రుల ఓటు కేవలం ఓటు మాత్రమే కాదని, రాష్ట్ర భవిష్యత్తును మార్చగల శక్తివంతమైన ఆయుధమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జూటూరు కీర్తిరెడ్డి అన్నారు. త్వరలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పరిధిలో ఆమె ప్రత్యేక బృందంతో కలిసి ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న పట్టభద్రులను కలిసి ఓటు నమోదు చేయించారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు విద్యావంతులు, యువత చేతుల్లోనే ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన సమగ్ర చట్టాల రూపకల్పనతో పాటు మంచి ప్రజాప్రతినిధుల ఎంపికలో విద్యావంతులు, మేధావుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. శాసనమండలిలో ప్రజా సమస్యలతోపాటు పట్టభద్రుల అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యం లభించాలంటే అర్హులైన వారంతా ఓటర్లుగా నమోదు కావాలని సూచించారు. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల పరిధిలోని పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.





టూత్‌బ్రష్ మింగిన వ్యక్తి

- శస్త్రచికిత్స లేకుండానే తొలగించిన వైద్యులు
- మహారాష్ట్రలో ఘటన

ప్రజానావ, ముంబై: మహారాష్ట్రలోని రాయగడ్ జిల్లా శిరవలి గ్రామానికి చెందిన రిక్షా డ్రైవర్ రాజేంద్ర మలుసారే (53) పళ్లు తోముకుంటుండగా ప్రమాదవశాత్తు టూత్‌బ్రష్‌ను మింగేశాడు. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురైన అతడిని కుటుంబ సభ్యులు నవీ ముంబైలోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు.కన్సల్టెంట్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ రావుసాహెబ్ రాథోడ్ నేతృత్వంలోని వైద్య బృందం ఎండోస్కోపీ విధానంలో సుమారు 19 సెంటీమీటర్ల పొడవున్న టూత్‌బ్రష్‌ను శస్త్రచికిత్స అవసరం లేకుండానే బయటకు తీసింది.

అనంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉంచిన రాజేంద్ర ఆరోగ్యం నిలకడగా ఉండటంతో ఇంటికి పంపించారు. ప్రాణాపాయం నుంచి కాపాడిన వైద్యులకు రాజేంద్ర కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కలల్లో వెంటాడిన స్నేహితుడి హత్య

ప్రజానావ, ముంబై: మద్యం మత్తులో స్నేహితుడిని హత్య చేసిన యువకుడు.. మూడు వారాల తర్వాత పోలీసులకు లొంగిపోయాడు. థానే జిల్లా డోంబివళి వెస్ట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. విశాల్ కదమ్ (42), ప్రభు కర్కడే (24) మరో వ్యక్తి ఇంట్లో కలిసి మద్యం తాగుతుండగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో ప్రభు బలంగా తన్నడంతో విశాల్ అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం మృతదేహాన్ని కాలువ ఒడ్డున పడేశారు. అయితే చనిపోయిన స్నేహితుడు పదేపదే కలల్లో కనిపిస్తుండటంతో మానసికంగా కుంగిపోయిన ప్రభు మూడు వారాల తర్వాత క్రైమ్ బ్రాంచ్ పోలీసులకు లొంగిపోయాడు. అతని సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని తరలించడంలో సహకరించిన ఇంటి యజమానిని కూడా అరెస్టు చేశారు.



సామ రామ్మోహన్‌రెడ్డికి మద్దతుగా విజయరెడ్డి ప్రచారం

- ఐఐఎం అధ్యాపకులను కలిసి ఓటు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి

ప్రజానావ, హైదరాబాద్: రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి పి. విజయరెడ్డి పట్టభద్రులను కోరారు. ఈ మేరకు ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని లక్డీకాపూల్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలను సందర్శించి అధ్యాపకులతో మాట్లాడారు. అర్హులైన వారంతా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కే. రఘువీర్‌తో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



పొగకు కళ్లెం.. కాలుష్యానికి చెక్!

బీఎస్6 వాహనాల్లో అధునాతన ఉద్గార నియంత్రణ సాంకేతికత

• మసిని వడపోసి.. విషవాయువులను తగ్గించే ప్రత్యేక వ్యవస్థలు • కాలుష్యం పూర్తిగా మాయం కాదు.. తగ్గించడమే లక్ష్యం



స్మార్ట్‌ఫోన్ల నుంచి ఆటోమొబైల్ రంగం వరకు సాంకేతికత రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతోంది. ముఖ్యంగా వాహనాల నుంచి వెలువడే పొగతో వాతావరణానికి కలిగే నష్టాన్ని తగ్గించేందుకు ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో భారత్‌లోనూ వాహన ఉద్గారాల నియంత్రణకు బీఎస్6 ప్రమాణాలను అమల్లోకి తీసుకొచ్చారు. తాజాగా ఢిల్లీలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలపై విధించిన ఆంక్షలు మరోసారి ఈ ప్రమాణాలపై చర్చకు తెరతీశాయి. 2026 నవంబరు 1 నుంచి బీఎస్6 ప్రమాణాలకు అనుగుణంగా లేని ఇతర రాష్ట్రాల వాహనాలకు ఢిల్లీలో ప్రవేశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ద్విచక్ర వాహనాలు, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ వాహనాలకు మినహాయింపునిచ్చింది. ఈ నేపథ్యంలో బీఎస్6 వాహనాలు నిజంగానే కాలుష్యాన్ని అరికడతాయా? వాటి నుంచి పొగ వెలువడదా? పాత వాహనాలతో పోలిస్తే వీటిలో ఉన్న ప్రత్యేకతలేమిటి? అన్న అంశాలు ఆసక్తికరంగా మారాయి.

–ప్రజానావ, ఫీచర్స్

పొగ ఉండదని కాదు.. హానికర వాయువులు తగ్గుతాయి!


బీఎస్6 వాహనం రోడ్డుపైకి వస్తే పొగ పూర్తిగా మాయమవుతుందని భావించడం పొరపాటే. పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలతో నడిచే వాహనాల్లో ఇంజిన్ పనిచేసే సమయంలో ఉద్గారాలు వెలువడటం సహజం. అయితే వాటిలోని హానికరమైన కాలుష్య కారకాల తీవ్రతను తగ్గించేందుకు బీఎస్6 వాహనాల్లో అధునాతన నియంత్రణ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నారు. ఇంజిన్ నుంచి వెలువడే వాయువులు బయటకు వెళ్లేలోపే వాటిలోని ప్రమాదకర మూలకాలను వడపోసేలా, రసాయనికంగా మార్చేలా ఈ సాంకేతికతలు పనిచేస్తాయి. ఫలితంగా పాత ప్రమాణాలతో పోలిస్తే గాలిలోకి చేరే కాలుష్య కారకాల మోతాదు గణనీయంగా తగ్గుతుంది. అంటే కాలుష్యాన్ని పూర్తిగా నిర్మూలించడం కాకుండా, నిర్దేశిత స్థాయిలకు పరిమితం చేయడమే బీఎస్6 లక్ష్యం.


మసిని పట్టి.. మళ్లీ మండించే ఫిల్టర్!

డీజిల్ వాహనాల్లో పొగతోపాటు వెలువడే సూక్ష్మ మసి కణాలు గాలి నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతాయి. వీటిని నియంత్రించేందుకు బీఎస్6 వాహనాల్లో డీజిల్ పార్టిక్యులేట్ ఫిల్టర్ (డీపీఎఫ్)ను ఉపయోగిస్తున్నారు. ఇంజిన్ నుంచి వచ్చే ఎగ్జాస్ట్‌లోని మసి కణాలను ఈ ఫిల్టర్ తనలోనే నిల్వ చేసుకుంటుంది. కొంతకాలానికి అందులో పేరుకుపోయిన మసిని అధిక ఉష్ణోగ్రత వద్ద మండించి తొలగిస్తుంది. ఈ ప్రక్రియను రీజెనరేషన్‌గా వ్యవహరిస్తారు. దీంతో ఫిల్టర్ తిరిగి పనిచేసే సామర్థ్యాన్ని పొందుతుంది. ఈ విధానంలో పొగ పూర్తిగా ఆగిపోకపోయినా, దానిలోని సూక్ష్మ కాలుష్య కణాలను గణనీయంగా తగ్గించవచ్చు.

నిర్వహణ సరిగ్గా లేకుంటే ప్రయోజనం ఉండదు!

వాహనం బీఎస్6 ప్రమాణాలకు అనుగుణంగా ఉందని మాత్రమే కాలుష్యం తగ్గిపోతుందని భావించకూడదు. ఇంజిన్‌లో సమస్యలు తలెత్తినా, డీపీఎఫ్ దెబ్బతిన్నా, ఉద్గారాల నియంత్రణ వ్యవస్థలు సరిగా పనిచేయకపోయినా కాలుష్య స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా డీపీఎఫ్‌లో మసి పేరుకుపోయి దాని పనితీరు దెబ్బతింటే వాహనం ఉద్గారాలపై ప్రభావం పడుతుంది. అందుకే నిర్ణీత వ్యవధిలో సర్వీసింగ్ చేయించడం, తయారీ సంస్థ సూచించిన నిర్వహణ పద్ధతులను పాటించడం అవసరం. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా వాహనదారుల నిర్లక్ష్యం ఉంటే ఆశించిన ఫలితాలు రావు.





విషవాయువులను మార్చే సాంకేతికత!



డీజిల్ వాహనాల నుంచి వెలువడే నైట్రోజన్ ఆక్సైడ్లు (ఎన్ఓఎక్స్) వాయు కాలుష్యానికి ప్రధాన కారణాల్లో ఒకటి. వీటిని తగ్గించేందుకు సెలెక్టివ్ కాటలిటిక్ రిడక్షన్ (ఎస్‌సీఆర్) సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఇందులో అడ్‌బ్లూ అనే ప్రత్యేక ద్రవాన్ని ఉపయోగిస్తారు. ఇది ఎగ్జాస్ట్ వ్యవస్థలోకి ప్రవేశించి ఉత్ప్రేరకంతో జరిగే రసాయనిక చర్య ద్వారా నైట్రోజన్ ఆక్సైడ్లను ప్రధానంగా నైట్రోజన్, నీటి ఆవిరిగా మారుస్తుంది. తద్వారా హానికరమైన వాయువులు వాతావరణంలోకి చేరే పరిమాణం తగ్గుతుంది. మరోవైపు పెట్రోల్ వాహనాల్లో క్యాటలిటిక్ కన్వర్టర్లు కీలక పాత్ర పోషిస్తాయి. కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోకార్బన్లు, నైట్రోజన్ ఆక్సైడ్ల వంటి కాలుష్య కారకాలను తక్కువ హానికరమైన సమ్మేళనాలుగా మార్చడంలో ఇవి సహాయపడతాయి.

లోపాలను ముందే పసిగట్టే వ్యవస్థ!



కాలుష్య నియంత్రణ పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్నది తెలుసుకోవడానికి బీఎస్6 వాహనాల్లో ఆన్‌బోర్డ్ డయాగ్నోస్టిక్స్ (ఓబీడీ) వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఇంజిన్ పనితీరు, ఉద్గారాల నియంత్రణ పరికరాలను ఇది నిరంతరం పర్యవేక్షిస్తుంది. ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే డాష్‌బోర్డుపై హెచ్చరిక లైట్ వెలుగుతుంది. తద్వారా వాహనదారుడు సమస్యను గుర్తించి సకాలంలో మరమ్మతులు చేయించుకునే అవకాశం ఉంటుంది. ఈ వ్యవస్థ వల్ల కాలుష్య నియంత్రణ పరికరాల్లో తలెత్తే లోపాలను గుర్తించడం సులభమవుతుంది.



కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజానావ, సిరిసిల్ల: కేంద్ర ప్రభుత్వం నిరుపేదలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న బీమా, పెన్షన్ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ ఆఫ్ బరోడా కనగర్తి బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ భూక్య పడావ్ సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం బ్యాంక్ ఖాతాదారులు, గ్రామ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) వంటి పథకాలు సామాన్య ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాలలో చేరి భవిష్యత్తులో ఆర్థిక భద్రత పొందాలని సూచించారు. అదేవిధంగా బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా తక్కువ వడ్డీ రేట్లకు అందిస్తున్న గోల్డ్ లోన్ సేవలను, ఇతర బ్యాంకింగ్ సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని కోరారు. బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జిన్న అనూష అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రజిత, వార్డు సభ్యులు మొకెనపెల్లి బాలరాజు, చిద్రవేణి నరేష్, బ్యాంక్ మిత్ర చిద్రవేణి వెంకటేష్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పంచాయతీ అండ

- 25 కిలోల బియ్యం, రూ.1,000 ఆర్థిక సాయం అందజేత

ప్రజానావ, కోనరావుపేట: మండలంలోని పల్లిమక్త గ్రామానికి చెందిన ఆదరవేణి లింగవ్వ భర్త దేవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి గ్రామ పంచాయతీ పాలకవర్గం అండగా నిలిచింది. ఈ మేరకు బుధవారం గ్రామ సర్పంచ్ జిన్న అనూష అనిల్ కుమార్ పాలకవర్గ సభ్యులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామ పంచాయతీ తరఫున 25 కిలోల బియ్యంతో పాటు రూ.1,000 నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా మృతుడు దేవయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. దేవయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జాగిరి ఆనందం, మొకనపెల్లి బాలరాజు, ఛిద్రవేణి నరేష్, రేగుల పద్మ పరశురాములు, జాగిరి శివ, ప్రవీణ్, బాలరాజు, దేవరాజు, దేవయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్న విజిలెన్స్ఎస్పీ

ప్రజానావ, వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధాలయమైన శ్రీభీమేశ్వర స్వామివారిని కరీంనగర్ విజిలెన్స్ ఎస్పీ జి.బసవ రెడ్డి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి విచ్చేసిన ఎస్పీకి ఆలయ అర్చకులు,వేద పండితులు స్వస్తితో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం మండపంలో వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ ఈవో రమాదేవి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి,లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.



మా ఇల్లు మాకు ఇప్పించండి!

- నాలుగేళ్లుగా తిరుగుతున్నా కరగని మనసులు
- న్యాయం చేయాలంటూ దళిత కుటుంబం డిమాండ్
- దుకాణం ముందు బాధిత కుటుంబం ఆందోళన

ప్రజానావ, వేములవాడ: బ్యాంకు రుణం తీర్చి ఇంటిని తిరిగి రిజిస్ట్రేషన్ చేస్తామని హామీ ఇచ్చి, నాలుగేళ్లుగా తిప్పించుకుంటున్నారని ఆరోపిస్తూ బాధిత కుటుంబం ఆందోళనకు దిగింది. వేములవాడ పాత మార్కెట్ ఏరియా రోడ్‌లోని మిట్టపెల్లి అంజనేయులు, ముద్రకోల లింబాద్రి గంగారాంలకు చెందిన శ్రీ వెంకటేశ్వర జ్యువెల్లరీ షాపు ఎదుట నిరసన చేపట్టి తమ ఇల్లు తమకు అప్పగించాలని డిమాండ్ చేసింది. ఓల్డ్ అర్బన్ కాలనీకి చెందిన మకాశి వంశీకృష్ణ కుటుంబానికి జాతర గ్రౌండ్ ప్రాంతంలో సొంత ఇల్లు ఉంది. ఆర్థిక అవసరాల కోసం ఎస్బీఐలో ఇంటిని తాకట్టు పెట్టి రుణం తీసుకోగా, బకాయిలు పేరుకుపోవడంతో మిట్టపెల్లి అంజనేయులు, ముద్రకోల లింబాద్రి గంగారాం రూ.12,56,815 చెల్లించి ఇంటిని తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితుడు ఆరోపించాడు. తిరిగి ఆ మొత్తాన్ని చెల్లిస్తే ఇంటిని తన తల్లి పేరుపై రిజిస్ట్రేషన్ చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు అడిగితే దాట వేస్తున్నారని బాధిత కుటుంబం వారి దుకాణం ముందు బైఠాయించి ఆందోళనకు దిగింది.

అటవీ భూములను సంరక్షించాలి

- చెరువులు,రిజర్వాయర్లు సంరక్షణ, అభివృద్ధికి చర్యలు చేపట్టాలి
- అధికారుకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం



ప్రజానావ, సిరిసిల్ల: అటవీ శాఖ అధికారులు అటవీ భూములను సంరక్షించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. అటవీ భూములు, వన్యప్రాణుల సంరక్షణ, చెరువులు (వెట్‌ల్యాండ్స్) సంరక్షణ, అభివృద్ధి, సిట్ నియామకం తదితర అంశాలపై అటవీ శాఖ, పోలీస్, రెవెన్యూ, నీటి పారుదల, మత్స్య, వ్యవసాయ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సంబంధిత అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, జిల్లా అటవీ శాఖ అధికారి సత్య నారాయణ, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) నియామకం, అటవీ భూముల ఆక్రమణలపై చర్యలు, అటవీ భూములకు సంబంధించిన సమస్యలు, ఆక్రమణలు, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల రికార్డుల పరిశీలన, భూముల సరిహద్దుల గుర్తింపు తదితర అంశాలపై చర్చించారు. అటవీ భూములకు సంబంధించిన రికార్డులు, పట్టా భూములు, ప్రభుత్వ భూముల వివరాలను క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను గుర్తించాలని, ఫారెస్ట్, రెవెన్యూ భూముల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల అధికారులు సంయుక్తంగా భూముల సరిహద్దులను పరిశీలించడం, జాయింట్ సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లాలోని అటవీ శాఖ భూములు, వన్యప్రాణులను అటవీ శాఖ అధికారులు సంరక్షించాలని సూచించారు. భూములు ఆక్రమించే వారిపై.. జంతువులను వేటాడే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ భూములను కబ్జా నుంచి కాపాడాలని, రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అటవీ భూముల్లో మొక్కలు నాటాలని తెలిపారు.

అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో విచారణ వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీలో ఎస్పీ మహేష్ బి. గితే, వివిధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు అట్రాసిటీ కేసుల బాధితులకు రూ.1.81 కోట్ల పరిహారం అందించినట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలపై ఎస్సీ, ఎస్టీలకు అవగాహన కల్పించాలని సూచించారు. కేసుల విచారణ వేగంగా పూర్తిచేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో జయశ్రీ, ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కేఎస్‌బీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, అధికారులు స్వప్న, విజయలక్ష్మి, సౌజన్య, హనుమంతు, కమిటీ సభ్యులు బి.నరేష్ నాయక్, బీపేట రాజు, భూక్య రమేష్, బడుగు లింగయ్య, జోగు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి వరంగల్‌కు చెందిన తనుగుల రత్నాకర్–అన్నపూర్ణ దంపతులు రూ.5 లక్షల విలువైన వెండి కానుకలు సమర్పించారు. తమ కుమారుడు జయంత్ పేరిట నుమారు 2 కిలోల బరువున్న వెండి గంప, బిందె, ప్లేట్‌ను ఆలయ ఈవో రమాదేవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ప్రతాప నవీన్ కుమార్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆలయ పీఆర్వో పెరిక శ్రీనివాస్ ఈ వివరాలను వెల్లడించారు.

– ప్రజానావ, వేములవాడ



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నిత్యాన్నదానం ట్రస్టుకు కామారెడ్డికి చెందిన బెజుగం శ్రీకాంత్ రెడ్డి, మంగని సంధ్యారాణి దంపతులు రూ.1.50 లక్షలు విరాళంగా అందజేశారు. బుధవారం ఆలయ ఈవో రమాదేవిని కలిసి నగదు అందించారు. ఈ సందర్భంగా దాతలకు అధికారులు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ పీఆర్వో పెరిక శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

– ప్రజానావ, వేములవాడ



గోశాలను పరిశీలించిన డీఈవో

ప్రజానావ, వేములవాడ: వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన తిప్పాపురం గోశాలను ఆలయ డీఈవో ప్రతాప నవీన్ కుమార్ పరిశీలించారు. గోవులకు అందిస్తున్న పచ్చిగడ్డి, ఎండుగడ్డి, తాగునీరు, ఆరోగ్య సంరక్షణ వసతులను తనిఖీ చేశారు. గోశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, నాణ్యతతో వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గోశాల పరిశుభ్రత, గోవుల సంరక్షణలో నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈ రామ్‌కిషన్ రావు, సీనియర్ అసిస్టెంట్ సంకపెల్లి పవన్, ప్లంబర్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

- సిరిసిల్లలో నిలిచిపోనున్న పారిశుద్ధ్య పనులు
- సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని హెచ్చరిక

ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని నిరసిస్తూ గురువారం (నవంబర్ 5) నుంచి కార్మికులు సమ్మెకు దిగనున్నారు. ఈ మేరకు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడారు. అక్టోబర్ 29న మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని కోరినా అధికారులు స్పందించలేదని ఆరోపించారు. గురువారం ఉదయం 5 గంటల నుంచి విధులు బహిష్కరించి సమ్మె చేపడతామని తెలిపారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు మున్సిపల్ కమిషనర్, పాలకవర్గమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కాసారపు శంకర్, నర్మెట బాబా కిషన్, బత్తుల దేవరాజు, మారుపాక లక్ష్మి, బడుగు శ్రీనివాస్, అర్జున్, మల్లేశం, దేవవ్వ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా ఎన్నికల్లో భారతీయుల సత్తా

- ప్రతినిధుల సభకు ఐదుగురు భారతీయ అమెరికన్లు ఎన్నిక
- మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా అరుణా మిల్లర్ మరోసారి విజయం
- ఎనిమిదోసారి గెలిచిన అమీ బేరా.. రెండోసారి ఎన్నికైన సుహాస్ సుబ్రమణ్యం
- కాలిఫోర్నియా, వర్జీనియా, వాషింగ్టన్, ఫ్లోరిడాల్లో విజయకేతనం

వాషింగ్టన్: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో భారతీయ అమెరికన్లు సత్తా చాటారు. ఇప్పటివరకు వెలువడిన ఫలితాల్లో ఐదుగురు భారతీయ సంతతి నేతలు ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా అరుణా మిల్లర్ మరోసారి విజయం సాధించారు. కాంగ్రెస్‌తో పాటు రాష్ట్ర చట్టసభలు, స్థానిక సంస్థలకు పోటీ చేసిన మరి కొందరు భారతీయ అమెరికన్ల ఫలితాలు ఇంకా వెలువడాల్సి ఉంది.



అమీ బేరాకు ఎనిమిదో విజయం

కాలిఫోర్నియాలోని మూడో కాంగ్రెస్ నియోజకవర్గం నుంచి డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి అమీ బేరా (61) మరోసారి గెలుపొందారు. రిపబ్లికన్ అభ్యర్థి రాబ్ టక్కర్‌ను ఓడించారు. వైద్యుడిగా కెరీర్ ప్రారంభించిన అమీ బేరా అసలు పేరు అమెరిష్ బాబులాల్ బేరా. గుజరాత్‌కు చెందిన వలస దారుల కుటుంబంలో లాస్‌ఏంజెలిస్‌లో జన్మించారు. 2012లో తొలిసారి కాంగ్రెస్‌కు ఎన్నికై, 2013 జనవరిలో బాధ్యతలు చేపట్టారు. తాజా విజయంతో ఎనిమిదోసారి ప్రతినిధుల సభలో అడుగుపెట్టనున్నారు. హౌస్ ఫారిన్ అఫైర్స్ కమిటీలో తూర్పు ఆసియా, పసిఫిక్ ఉపసంఘం ర్యాంకింగ్ సభ్యుడిగా, ఇంటెలిజెన్స్ కమిటీలోనూ పనిచేస్తున్నారు. ఆరోగ్య సంరక్షణ, అమెరికా–భారత్ సంబంధాలు, విదేశాంగ విధానాలపై ఆయనకు ప్రత్యేక ఆసక్తి.

సుహాస్ సుబ్రమణ్యంకు రెండోసారి

వర్జీనియాలోని పదో కాంగ్రెస్ నియోజకవర్గం నుంచి డెమోక్రటిక్ అభ్యర్థి సుహాస్ సుబ్రమణ్యం (40) రెండోసారి విజయం సాధించారు. రిపబ్లికన్ అభ్యర్థి దేవ్ బెక్‌విత్‌ను ఓడించారు. టెక్సాస్‌లోని హ్యూస్టన్‌లో జన్మించిన ఆయన న్యాయవాది, వ్యాపారవేత్త. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా హయాంలో వైట్‌హౌస్‌లో సాంకేతిక విధానాల సలహాదారుగా పనిచేశారు. 2019 నుంచి 2023 వరకు వర్జీనియా ప్రతినిధుల సభలో, 2023 నుంచి 2024 వరకు రాష్ట్ర సెనేట్‌లో సభ్యుడిగా ఉన్నారు. వర్జీనియాలో భార్య మిరాండా పెనా సుబ్రమణ్యం, ఇద్దరు కుమార్తెలతో నివసిస్తున్నారు. వాలంటీర్ ఫైర్‌ఫైటర్, అత్యవసర వైద్య సేవల సిబ్బందిగానూ సేవలందించారు.

సిలికాన్ వ్యాలీలో రో ఖన్నా హవా

కాలిఫోర్నియాలోని 17వ కాంగ్రెస్ నియోజకవర్గం నుంచి డెమోక్రటిక్ నేత రో ఖన్నా (50) తిరిగి ఎన్నికయ్యారు. సిలికాన్ వ్యాలీలోని కీలక ప్రాంతాలు ఈ నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. ఫిలడెల్ఫియాలో భారతీయ వలస దారుల కుటుంబంలో జన్మించిన ఆయన కాంగ్రెస్ ప్రోగ్రెసివ్ కాకస్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. 2020లో బెర్నీ శాండర్స్ అధ్యక్ష ఎన్నికల ప్రచారానికి సహాధ్యక్షుడిగా పనిచేశారు. దోషిగా తేలిన జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన పత్రాలను విడుదల చేయాలని రిపబ్లికన్ ఎంపీ థామస్ మాసీతో కలిసి ఆయన డిమాండ్ చేశారు.

చెన్నై అమ్మాయి ప్రమీలా జయపాల్

వాషింగ్టన్ రాష్ట్రంలోని ఏడో కాంగ్రెస్ నియోజకవర్గం నుంచి ప్రమీలా జయపాల్ మరోసారి గెలుపొందారు. 1965లో చెన్నైలో జన్మించిన ఆమె 16ఏళ్ల వయసులో ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లారు. జార్జ్‌టౌన్ యూనివర్సిటీలో చదివిన అనంతరం నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. రాజకీయాల్లోకి రాక ముందు అంతర్జాతీయ ప్రజారోగ్యం, అభివృద్ధి రంగాల్లో పనిచేశారు. వలసదారుల హక్కుల కోసం 'వన్‌అమెరికా' సంస్థను స్థాపించారు. 2016లో తొలిసారి ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. ఈ సభకు ఎన్నికైన తొలి దక్షిణాసియా సంతతి మహిళగా గుర్తింపు పొందారు. వలస విధానాలు, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక అసమానతలపై గళమెత్తుతున్నారు.

ఫ్లోరిడా నుంచి పియా దండియా

ఫ్లోరిడాలోని 22వ కాంగ్రెస్ నియోజకవర్గం నుంచి డెమోక్రటిక్ అభ్యర్థి పియా దండియా విజయం సాధించారు. రిపబ్లికన్ అభ్యర్థి కేసీ ఆస్కర్‌ను ఓడించారు. భారతదేశం నుంచి వలస వెళ్లిన తల్లిదండ్రులకు పామ్ బీచ్ కౌంటీలో జన్మించిన ఆమె ఉపాధ్యాయురాలిగా, హైస్కూల్ ప్రిన్సిపల్‌గా పనిచేశారు. వైట్‌హౌస్ ఫెలోగా సేవలందించడంతో పాటు యాపిల్ సంస్థలోనూ పనిచేశారు. తక్కువ ఆదాయ కుటుంబాల విద్యార్థులకు ఉన్నత విద్య, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఓ హైస్కూల్‌ను స్థాపించారు. జనవరిలో కొత్త ప్రతినిధుల సభ కొలువుదీరినప్పుడు ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు.

అరుణా మిల్లర్‌కు మరోసారి అవకాశం

ఆంధ్రప్రదేశ్‌లో జన్మించిన అరుణా మిల్లర్ (61) మేరీ ల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా మరోసారి ఎన్నికయ్యారు. ఏడేళ్ల వయసులో కుటుంబంతో కలిసి అమెరికాకు వలస వెళ్లారు. మిస్సోరి యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి సివిల్ ఇంజినీరింగ్‌లో పట్టా పొందారు. మోంట్‌గోమేరీ కౌంటీ రవాణా విభాగంలో 25 ఏళ్లపాటు సివిల్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజినీర్‌గా పనిచేశారు.

మధ్యంతర ఫలితాలతో ట్రంప్‌లో అసహనం

- రిపబ్లికన్ అభ్యర్థులు, ఫాక్స్ న్యూస్‌పై తీవ్ర విమర్శలు
- తాను బరిలో ఉంటే భారీ మెజారిటీ వచ్చేదని వ్యాఖ్య
- డెమోక్రాట్లతో కలిసి పనిచేస్తానంటూ సంకేతాలు




వాషింగ్టన్: అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల సరళి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రతికూలంగా మారడంతో ఆయన అసహనం వ్యక్తం చేస్తున్నారు. డెమోక్రాట్లకు అనుకూలంగా ఫలితాలు వస్తుండటంతో సొంత పార్టీ అభ్యర్థులతో పాటు తనకు మద్దతుగా నిలిచే ఫాక్స్ న్యూస్‌పైనా విమర్శలు గుప్పించారు. తాను ఎన్నికల బరిలో ఉంటే రిపబ్లికన్లు భారీ మెజారిటీతో గెలిచేవారని వ్యాఖ్యానించారు. అదే సమయంలో డెమోక్రాట్లతో కలిసి పనిచేసేందుకు సిద్ధమని సంకేతాలిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ట్రంప్ 30 సభల్లో పాల్గొని రిపబ్లికన్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. అయినప్పటికీ ఫలితాలు ఆశించిన విధంగా లేకపోవడంతో ట్రూత్ సోషల్ వేదికగా స్పందించారు. తన పేరు బ్యాలెట్‌పై లేదని, తాను పోటీ చేసి ఉంటే భారీ విజయం సాధించేవారమని పేర్కొన్నారు. టెక్సాస్‌లో పార్టీకి ఎదురైన ప్రతికూల ఫలితాలపై గవర్నర్ గ్రెగ్ అబాట్‌ను విమర్శించారు. ఎన్నికల కవరేజీ విషయంలో ఫాక్స్ న్యూస్‌పై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యూయార్క్ మాజీ మేయర్ బిల్ డి బ్లాసియోను ఎన్నికల విశ్లేషణ కోసం చర్చకు ఆహ్వానించడాన్ని తప్పుబట్టారు. రిపబ్లికన్ల ఓటమికి ఆ చానల్ కూడా బాధ్యత వహించాలని, దాని ప్రశ్నలు, విశ్లేషణలు తమ పార్టీకి వ్యతిరేకంగా ఉన్నాయని ఆరోపించారు.

వీటోతోనే పాలన సాగిస్తారా?

మధ్యంతర ఎన్నికల ఫలితాలపై రాజకీయ వ్యాఖ్యాతగా మారి విశ్లేషణలు చేస్తానని ట్రంప్ ప్రకటించారు. తన మిగిలిన రెండేళ్ల పదవీకాలంలో కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా పాలన సాగించనున్నట్లు సంకేతాలిస్తూ 'వీటో' అని రాసి ఉన్న ఎరుపు రంగు టోపీ చిత్రాన్ని సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. అయితే ప్రతి అంశంపైనా వీటో ప్రయోగిస్తూ పాలన సాగించాలని తనకు లేదని, డెమోక్రాట్లతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని 'పొలిటికో'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టులతో సత్వర న్యాయం

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ: దేశంలో న్యాయ ప్రక్రియను వేగవంతం చేసి, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టుల పథకం దోహదపడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ పథకాన్ని మరో ఐదేళ్ల పాటు కొనసాగించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఆయన బుధవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'జాప్యం తగ్గి.. సత్వర న్యాయం అందుతుంది' అని పేర్కొన్నారు. ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టులు (ఎఫ్‌టీఎస్‌సీ), ప్రత్యేక పోక్సో న్యాయస్థానాలకు సంబంధించిన కేంద్ర ప్రాయోజిత పథకాన్ని 2026 ఏప్రిల్ 1 నుంచి మరో ఐదేళ్లపాటు కొనసాగించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో పోక్సో సహా కీలక కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాల సేవలు కొనసాగనున్నాయి. ఈ పథకానికి మొత్తం రూ.3,788.04 కోట్ల వ్యయం చేయనున్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.2,353.15 కోట్లు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కలిపి రూ.1,434.89 కోట్లు భరించనున్నాయి. కేంద్రం తన వాటాను నిర్భయ నిధి నుంచి సమకూర్చనుంది.

పంజాబ్ మత్తులో జోగుతోంది

- డ్రగ్స్ నిర్మూలిస్తామని చెప్పి మాన్ ఏం సాధించారు?
- సీఎంపై రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు



సంగ్రూర్: పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. డ్రగ్స్ సమస్యను నిర్మూలిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఆప్ ప్రభుత్వం ఏం సాధించిందో చెప్పాలని నిలదీశారు. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ పార్లమెంటులో ఉదయం 11 గంటలకే మద్యం వాసనతో ఉండేవారని ఆరోపించారు. బుధవారం సంగ్రూర్‌లో కాంగ్రెస్ నిర్వహించిన 'ఇన్సాఫ్ ర్యాలీ'లో ఆయన ప్రసంగించారు. పంజాబ్‌లో హెరాయిన్, సింథటిక్ డ్రగ్స్, మందుల దుర్వినియోగం తీవ్ర సమస్యగా మారాయని రాహుల్ అన్నారు. డ్రగ్స్ నిర్మూలిస్తామని చెప్పిన ఆప్ ప్రభుత్వం ఏ ప్రాంతంలో ఈ సమస్యను పూర్తిగా అరికట్టిందో చెప్పాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ బాధితుల కష్టాలను అర్థం చేసుకుని పోరాడే నాయకత్వం రాష్ట్రానికి అవసరమన్నారు. ఢిల్లీ నేతల కనుసన్నల్లో పంజాబ్ పాలన సాగుతోందని, సీఎం మాన్ నామమాత్రంగా మిగిలారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని పంజాబ్ నుంచే పాలిస్తామని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ కాంగ్రెస్‌ను దేశవ్యతిరేక పార్టీగా అభివర్ణించడంపైనా రాహుల్ స్పందించారు. ఈ అంశంపై ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. పార్లమెంటులో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా మైక్ నిలిపివేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల హత్యకు గురైన గాయకుడు సిద్ధూ మూసేవాలా తండ్రి బల్కౌర్ సింగ్‌ను కలిసిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఆ కుటుంబం ఎదుర్కొంటున్న బాధను సభలో వివరించారు.

హర్మూజ్‌లో భారత్‌కు మినహాయింపు

- నాలుగు దేశాల నౌకలకు రవాణా ఆంక్షల నుంచి ఇరాన్ వెసులుబాటు
- భారత్, చైనా, ఇరాక్, ఖతార్ నౌకలకు స్వేచ్ఛగా రాకపోకలు
- భారత్ నుంచి ఔషధాల దిగుమతుల కోసమే ఈ నిర్ణయమని వెల్లడి
- ఘర్షణల వేళ కొనసాగుతున్న వాణిజ్య నౌకలపై దాడులు



దుబాయ్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. వ్యూహాత్మకంగా అత్యంత ప్రాధాన్యమున్న హర్మూజ్ జలసంధిలో రవాణా ఆంక్షల నుంచి భారత్ సహా నాలుగు దేశాల వాణిజ్య నౌకలకు మినహాయింపు ఇచ్చింది. భారత్, చైనా, ఇరాక్, ఖతార్ నౌకలు ఎలాంటి ఆంక్షలు లేకుండా జలసంధి గుండా ప్రయాణించవచ్చని ఇరాన్ పార్లమెంటు జాతీయ భద్రత, విదేశాంగ విధాన కమిటీ ఉపాధ్యక్షుడు అమీర్ హయత్ మొగద్దమ్ వెల్లడించారు. ఇరాన్ విద్యార్థుల వార్తా సంస్థ (ఐఎస్ఎన్ఏ)కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని తెలిపారు. ఈ మినహాయింపులు పరస్పర ప్రయోజనాలు, ప్రత్యేక పరిస్థితుల ఆధారంగా కల్పించినట్లు పేర్కొన్నారు. భారత్ నౌకలకు రాకపోకల్లో వెసులుబాటు కల్పించడం వెనుక ప్రధానంగా ఔషధాల దిగుమతుల అవసరం ఉందని మొగద్దమ్ వివరించారు. చైనా నౌకలకు మినహాయింపు ఇవ్వడం ద్వారా ఆ దేశ రాజకీయ మద్దతు పొందాలన్న ఉద్దేశం ఉందని తెలిపారు. ఈ నాలుగు దేశాల నౌకలు స్వేచ్ఛగా ప్రయాణిస్తున్నాయని, వాటిని అమెరికా కూడా అడ్డుకోవడం లేదని పేర్కొన్నారు.

ప్రపంచ ఇంధన రవాణాకు కీలక మార్గం

పర్షియన్ గల్ఫ్‌ను గల్ఫ్ ఆఫ్ ఒమన్‌తో అనుసంధానించే హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైనది. సాధారణ పరిస్థితుల్లో ప్రపంచ ఇంధన సరఫరాల్లో దాదాపు 20శాతం ఈ మార్గం గుండానే జరుగుతుంది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు ప్రారంభించడంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగాయి. ప్రతీకారంగా ఇరాన్ దాడులకు దిగడంతో జలసంధిలో నౌకల రాకపోకలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత ఇరాన్ ఈ జలమార్గాన్ని మూసివేసే చర్యలు చేపట్టగా, కొన్ని వారాల తర్వాత అమెరికా ఇరాన్ ఓడరేవులపై నావికా దిగ్బంధం విధించింది.

నౌకలపై దాడులు.. భారతీయుల మృతి

ప్రస్తుతం ఇరాన్ కఠిన ఆంక్షలు అమలు చేస్తూ కొద్దిపాటి నౌకలకే అనుమతిస్తోంది. మిగిలిన నౌకలను తనిఖీ చేసిన తర్వాతే పంపుతోంది. కొన్ని సందర్భాల్లో రవాణా రుసుములనూ వసూలు చేస్తోంది. ఫిబ్రవరిలో ఘర్షణలు ప్రారంభమైనప్పటి నుంచి ఈ ప్రాంతంలో నౌకలపై జరిగిన దాడుల్లో కనీసం 15మంది భారతీయ నావికులు మరణించారు. తాజాగా సోమవారం సాయంత్రం ఒమన్‌లోని లిమా సమీపంలో 'ఎంఎస్‌వీ అల్ జుసుఫీ' వాణిజ్య నౌకపై జరిగిన దాడిలో మరో భారతీయ నావికుడు ప్రాణాలు కోల్పోయాడు.

చర్చలతోనే పరిష్కారం: భారత్

ఈ ఘర్షణలకు చర్చలు, దౌత్య మార్గాల ద్వారా పరిష్కారం కనుగొనాలని భారత్ మొదటి నుంచీ కోరుతోంది. వాణిజ్య నౌకలపై వరుస దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఇప్పటికే స్పష్టం చేసింది. అంతర్జాతీయ జలమార్గాల్లో వాణిజ్య నౌకలు, పౌర మౌలిక సదుపాయాలపై దాడులు తక్షణమే ఆగాలని, అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా నౌకల స్వేచ్ఛాయుత రాకపోకలు, వాణిజ్యాన్ని పునరుద్ధరించాలని భారత్ డిమాండ్ చేస్తోంది.

ఉచిత యూపీఐ లావాదేవీలతో నష్టమెంత?

- నష్టాలపై కచ్చితమైన గణాంకాలు లేవు: ఐఎస్‌బీ ప్రొఫెసర్
- ప్రస్తుత విధానం సాధ్యం కాకపోతేనే ఎండీఆర్ వసూలు చేయాలి
- చార్జీలతో చిరు వ్యాపారులు మళ్లీ నగదు లావాదేవీలకు మళ్లే ప్రమాదం
- 720 మందికి పైగా వీధి వ్యాపారులపై ఐఎస్‌బీ సర్వేలో వెల్లడి

ముంబై: ఉచిత యూపీఐ లావాదేవీల వల్ల ఎంత నష్టం జరుగుతోందన్న దానిపై ప్రస్తుతం కచ్చితమైన గణాంకాలు అందుబాటులో లేవని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) అసోసియేట్ ప్రొఫెసర్ ప్రసన్న తంత్రి పేర్కొన్నారు. యూపీఐ లావాదేవీల వల్ల కలిగే ప్రయోజనాలు, ముఖ్యంగా వినియోగదారుల ప్రవర్తనకు సంబంధించిన విలువైన సమాచారం ద్వారా పరిశ్రమకు చేకూరుతున్న లాభాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత విధానం ఆర్థికంగా కొనసాగించడం సాధ్యం కాదని తేలితేనే వ్యాపారుల నుంచి మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వసూలు చేయాలని అభిప్రాయపడ్డారు.

ఖర్చులు, ప్రయోజనాలపై సమగ్ర లెక్కలు

యూపీఐ నిర్వహణకు అయ్యే ఖర్చులపైనే చర్చ జరుగుతోందని, దాని ద్వారా లభించే ప్రయోజనాలను విస్మరిస్తున్నారని ప్రసన్న తంత్రి అన్నారు. పన్ను చెల్లింపుదారులపై ఎంత భారం పడుతోంది? వ్యాపారులు నిజంగా ఎంత నష్టపోతున్నారు? అనే అంశాలను ఖర్చులు, ప్రయోజనాల ప్రాతిపదికన సమగ్రంగా విశ్లేషించాలని సూచించారు. ఈ ఏడాది ప్రారంభంలో రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై వ్యాపారుల నుంచి 0.40 శాతం ఎండీఆర్ వసూలుకు ప్రభుత్వం అనుమతించింది. అయితే మొత్తం యూపీఐ లావాదేవీల్లో 96 శాతానికి ఈ చార్జీలు వర్తించవని స్పష్టం చేసింది. అక్టోబరు 15 నుంచి అమలు కావాల్సిన ఈ విధానాన్ని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) దీపావళి తర్వాతకు వాయిదా వేసింది. అమలు తేదీపై ఇంకా స్పష్టత రాలేదు.

నగదు లావాదేవీల వైపు మళ్లే ప్రమాదం

యూపీఐ మౌలిక సదుపాయాలు, సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి చేసిన పెట్టుబడుల నుంచి ఆదాయం రావాలంటూ ఆర్థిక సేవల రంగం ఎండీఆర్ అమలును కోరుతోంది. మరోవైపు, యూపీఐ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు ఖర్చుల కంటే ఎక్కువగా ఉన్నాయని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా 720 మందికి పైగా వీధి వ్యాపారులపై ఐఎస్‌బీ నిర్వహించిన సర్వే కీలక అంశాలను వెల్లడించింది. ఎండీఆర్ అమలుతో చిరు వ్యాపారులు తిరిగి నగదు లావాదేవీల వైపు మళ్లే ప్రమాదం ఉందని పేర్కొంది. సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు 70 శాతం మంది ఒక్కోసారి రూ.2,000కు మించి సరఫరాదారులకు చెల్లింపులు చేస్తున్నట్లు వెల్లడైంది. సర్వేకు ముందు పది రోజుల్లో తమ నుంచి యూపీఐ చెల్లింపులపై అదనపు రుసుములు వసూలు చేయాలని సరఫరాదారులు కోరినట్లు 10.4 శాతం మంది తెలిపారు. రిటైల్ స్థాయిలో చిన్న వ్యాపారులకు మినహాయింపులు ఇచ్చినా, హోల్‌సేల్ కొనుగోళ్ల సమయంలో వారు ఎదుర్కొనే ఖర్చులను ఆ విధానం పరిగణనలోకి తీసుకోవడం లేదని ఐఎస్‌బీ అధ్యయనం పేర్కొంది. ఎండీఆర్ అమలులో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించింది.

ఎన్నికల కమిషనర్లకు జీవితకాల రక్షణ?

- సివిల్, క్రిమినల్ కేసుల నుంచి మినహాయింపును సవాలు చేస్తూ పిటిషన్లు
- సెక్షన్ 16పై విచారణకు అంగీకరించిన సుప్రీం
- కేంద్రానికి నోటీసులు.. నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశం
- డిసెంబరు 18న తదుపరి విచారణ

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు విధుల నిర్వహణకు సంబంధించిన చర్యలపై సివిల్, క్రిమినల్ కేసుల నుంచి సంపూర్ణ రక్షణ కల్పించే చట్ట నిబంధన రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు విచారణకు అంగీకరించింది. ఈ నిబంధనను సవాలు చేస్తూ ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, సామాజిక కార్యకర్త అరుణ్ అగర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. ఇదే అంశంపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న మరో పిటిషన్‌తో వీటిని జతచేసి డిసెంబరు 18న విచారించనున్నట్లు తెలిపింది. 2023లో కేంద్రం తీసుకొచ్చిన ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టంలోని సెక్షన్ 16ను పిటిషనర్లు సవాలు చేశారు. ఈ నిబంధన ప్రకారం.. ప్రస్తుతం లేదా గతంలో సీఈసీ, ఎన్నికల కమిషనర్లుగా పనిచేసిన వారిపై విధుల నిర్వహణలో తీసుకున్న చర్యలు, చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఎలాంటి సివిల్, క్రిమినల్ కేసులనూ న్యాయస్థానాలు స్వీకరించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న కేసులనూ విచారించరాదు.

రాజ్యాంగం కల్పించని రక్షణ ఎలా?

రాజ్యాంగం ఇవ్వని విస్తృత రక్షణను సాధారణ చట్టం ద్వారా ఎన్నికల కమిషనర్లకు కల్పించడం సరికాదని మనోజ్ ఝా తన పిటిషన్‌లో వాదించారు. రాష్ట్రపతి, ఎంపీలు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు సైతం లేని స్థాయిలో మినహాయింపు ఇవ్వడం సమంజసం కాదన్నారు. అవినీతి, దురుద్దేశపూర్వక చర్యలు, ఇతర నేరాలకూ ఈ రక్షణ వర్తించే అవకాశం ఉందని అభ్యంతరం తెలిపారు. రాజ్యాంగంలోని 361వ అధికరణ రాష్ట్రపతి, గవర్నర్లకు, 105, 194 అధికరణలు ప్రజాప్రతినిధులకు నిర్దిష్ట రక్షణ కల్పిస్తున్నాయని గుర్తుచేశారు. ఎన్నికల సంఘానికి సంబంధించిన 324వ అధికరణలో మాత్రం కమిషనర్లకు ఇలాంటి మినహాయింపు లేదని పేర్కొన్నారు.

స్వతంత్రత అంటే చట్టానికి అతీతం కాదు..

సెక్షన్ 16తో ఎన్నికల కమిషనర్లకు అవినీతి, ఫోర్జరీ వంటి తీవ్రమైన నేరాలపైనా జీవితకాల రక్షణ లభిస్తోందని అరుణ్ అగర్వాల్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. విధుల నిర్వహణలో భాగంగా చేసినట్లు భావించే చర్యల పరిధిని కూడా ఈ నిబంధన విస్తృతంగా నిర్వచించిందని అభ్యంతరం తెలిపారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడటం అంటే చట్టానికి అతీతంగా వ్యవహరించే అధికారం కల్పించడం కాదని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషనర్లపై తప్పుడు, వేధింపులకు ఉద్దేశించిన ఫిర్యాదులను అడ్డుకోవడానికి ముందస్తు న్యాయ పరిశీలన వంటి ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని అగర్వాల్ సూచించారు. ఓటరు జాబితా నుంచి అన్యాయంగా పేరు తొలగించిన వ్యక్తులు, దురుద్దేశపూర్వక చర్యలతో నష్టపోయిన అభ్యర్థులు, అవినీతిపై ఫిర్యాదు చేసే పౌరులు న్యాయపరమైన పరిష్కారం పొందలేని పరిస్థితి ఈ నిబంధనతో ఏర్పడుతుందని పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాల రొటేషన్‌కు సుప్రీం నిరాకరణ

పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నియోజకవర్గాలను నిర్దిష్ట కాల వ్యవధిలో మారుస్తూ (రొటేషన్) ఉండాలన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇది శాసన వ్యవస్థ పరిధిలోని విధానపరమైన అంశమని, న్యాయస్థానాలు ఆదేశాలు జారీ చేయలేవని స్పష్టం చేసింది. ఈ విషయంలో పార్లమెంటు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ అంశంపై అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్,



న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి.మోహనలతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ జిల్లా కడీపూర్ (191) అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఓటరు జగదీశ్ సింగ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి దాదాపు ఏడు దశాబ్దాలుగా ఎస్సీలకు రిజర్వు చేస్తూ వస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ విధానంలో మార్పులు లేకపోవడం రాజ్యాంగంలోని 14, 15, 19 అధికరణలకు విరుద్ధమని వాదించారు. ఎస్సీ వర్గానికి చెందిన అభ్యర్థులకే పోటీ చేసే అవకాశం ఉండటంతో ఓటర్లకు అందుబాటులో ఉండే అభ్యర్థుల ఎంపిక పరిమితమవుతోందని తెలిపారు. ఈ విధానం వల్ల విస్తృత సమాజానికి మేలు జరగకుండా, కొన్ని రాజకీయ కుటుంబాలకే ప్రయోజనం కలుగుతోందని అభిప్రాయపడ్డారు. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను మారుస్తూ అమలు చేస్తున్న విధానాన్ని పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకూ వర్తింపజేయాలని పిటిషనర్ కోరారు. రాజ్యాంగంలోని 243డీ, 243టీ అధికరణల తరహాలో రిజర్వ్‌డ్ నియోజకవర్గాలను నిర్దిష్ట కాలానికి మారుస్తూ ఉండేలా ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ బాగ్చీ కీలక వ్యాఖ్యలు చేశారు. బహుళపార్టీల ప్రజాస్వామ్యంలో ఓటర్లు కులం, మతం ఆధారంగా కాకుండా రాజకీయ పార్టీల సిద్ధాంతాలను బట్టి ఓటు వేయాలని అన్నారు. ఒక పార్టీ సిద్ధాంతం నచ్చితే, ఆ సిద్ధాంతానికి ప్రాతినిధ్యం వహించే అభ్యర్థి ఎవరన్నది ముఖ్యం కాదని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో పిటిషనర్ వాదన సమర్థనీయం కాదని అభిప్రాయపడ్డారు.

చాలా వ్యత్యాసం ఉంది

ఓటు హక్కుకు, ఒక నిర్దిష్ట నియోజకవర్గం నుంచి పోటీ చేసే హక్కుకు మధ్య తేడా ఉందని ధర్మాసనం పేర్కొంది. రిజర్వేషన్ లేని నియోజకవర్గాల్లో అన్ని వర్గాల అభ్యర్థులూ పోటీ చేయవచ్చని గుర్తుచేసింది. రొటేషన్ విధానం తీసుకురావాలన్నది విధానపరమైన నిర్ణయమని, అందుకోసం పార్లమెంటును ఆశ్రయించాలని ప్రధాన న్యాయమూర్తి సూచించారు. అవసరమైతే ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు ఇవ్వడం, నిరసనలు, ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా తమ డిమాండ్‌ను తెలియజేయవచ్చని వ్యాఖ్యానించారు. 2002 నాటి నియోజకవర్గాల పునర్విభజన చట్టంలోని సెక్షన్ 9(1)(సి) ప్రకారం ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో రిజర్వ్‌డ్ నియోజకవర్గాలను గుర్తిస్తారు. ఈ నిబంధనను సమర్థిస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును మార్చాల్సిన అవసరం తమకు కనిపించడం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

నాకింకా 31ఏళ్లే

నా ఆటలో 21ఏళ్ల జోరుంది

- వేగం తగ్గలేదు.. సాధించాల్సింది ఇంకా ఉంది
- శరీరాన్ని కాపాడుకుంటే మళ్లీ నంబర్‌వన్ కావచ్చు
- ఒలింపిక్స్ పతక విజేత పీవీ సింధు
- బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు హైదరాబాద్ స్టార్



న్యూఢిల్లీ: ఆటకు వయసు అడ్డంకి కాదని భారత బ్యాడ్మింటన్ స్టార్, ఒలింపిక్స్ పతక విజేత పీవీ సింధు స్పష్టం చేసింది. తనకు ఇంకా 31 ఏళ్లేనని, ఆటలో ఇప్పటికీ 21 ఏళ్ల వయసులో ఉన్నంత వేగం, ఉత్సాహం ఉన్నాయని ధీమా వ్యక్తం చేసింది. శరీరాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ, సరైన ప్రణాళికతో ముందుకెళ్తే మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ స్థానాన్ని అందుకోగలనని పేర్కొంది. డిసెంబరు 9 నుంచి 13 వరకు చైనాలో జరిగే బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు సింధు అర్హత సాధించింది.

మళ్లీ అగ్రస్థానమే లక్ష్యం

ఈ ఏడాది జపాన్ ఓపెన్, హైలో ఓపెన్ సూపర్ 500 టైటిళ్లు గెలిచిన సింధు.. ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచింది. ఈ ప్రదర్శనతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి చేరుకుంది. వరల్డ్ టూర్ ఫైనల్స్ అర్హత జాబితాలో ఐదో స్థానంలో నిలిచి టాప్–8లో చోటు దక్కించుకుంది. '30 ఏళ్ల దాటిన తర్వాత కూడా ఎంతోమంది క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన చేస్తున్నారు. నేనెందుకు మళ్లీ అగ్రస్థానానికి చేరుకోలేను? నాలో ఇప్పటికీ ఆ సామర్థ్యం ఉంది. 21 ఏళ్ల వయసులో ఉన్నప్పటి ఉత్సాహం ఇప్పటికీ తగ్గలేదు. అయితే ఇప్పుడు ఆటలోని సవాళ్లు, తప్పిదాలను మరింత మెరుగ్గా అర్థం చేసుకోగలుగుతున్నా'' అని సింధు తెలిపింది.

ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం

వరుస టోర్నీలతో శరీరంపై ఒత్తిడి పెరగకుండా జాగ్రత్త పడుతున్నట్లు సింధు వెల్లడించింది. ఆటగాళ్లు ప్రతి టోర్నీలో పాల్గొనడం కంటే, బరిలోకి దిగినప్పుడు పూర్తి సామర్థ్యంతో ఆడటం ముఖ్యమని అభిప్రాయపడింది. తన ఫిట్‌నెస్, శారీరక స్థితిని కోచ్, ఫిజియోతో కలిసి నిరంతరం సమీక్షిస్తున్నట్లు తెలిపింది. శరీర పరిస్థితికి అనుగుణంగానే టోర్నీలను ఎంపిక చేసుకుంటున్నానని పేర్కొంది.



కింగ్ మెరుపులు.. గర్నూర్ బౌన్సర్లు



- తొలి వన్డేలో కివీస్‌పై భారత్ ఘన విజయం
- ఆకట్టుకున్న టీమిండియా బౌలర్లు
- అర్ధ సెంచరీతో మరో క్లాస్ ఛేజ్ ఇన్నింగ్స్ ఆడిన విరాట్ కోహ్లీ

ఆక్లాండ్: యువ పేసర్ల పదునైన బౌలింగ్.. విరాట్ కోహ్లీ అద్భుత బ్యా టింగ్ తోడవడం తో న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో భారత్ ఘన విజ యం సాధించింది. వర్షం కారణంగా 40.2 ఓవర్లకు కుదించిన మ్యా చ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ 185 పరుగులకు ఆలౌటైంది. డక్‌వర్త్ లూయిస్ విధానంలో భారత్ లక్ష్యాన్ని 143 పరుగులుగా నిర్ణ యించారు. టీమిండియా 22.4 ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. గురువారం 38వ పుట్టినరోజు జరుపుకోనున్న కోహ్లీ.. ఒకరోజు ముందుగానే అర్ధశతకంతో అభిమానులకు పండగ అందించాడు. అంతకుముందు భారత ప్రధాన పేసర్లు బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ అందుబాటులో లేకపోయినా యువ బౌలర్లు అదర గొట్టారు. ఆరు అడుగుల ఐదు అంగుళాల ఎత్తున్న గర్నూర్ బ్రార్ వేగం, బౌన్స్‌తో కివీస్ బ్యాటర్లను ఇబ్బందిపెట్టాడు. తొమ్మిది ఓవర్లకు 44 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. అర్ష్‌దీప్ సింగ్ 70 పరుగులిచ్చి నాలుగు వికెట్లు సాధించాడు. అన్ష్ల్ కాంబోజ్ 10 ఓవర్లలో కేవలం 22 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. తన స్పెల్‌లో ఏకంగా 46 డాట్ బాల్స్ వేయడం విశేషం. దీంతో కివీస్ 40.2 ఓవర్ల లో 185 పరుగులకే పరిమితమైంది.



కోహ్లీ వింటేజ్ బ్యాటింగ్

స్వల్ప లక్ష్య ఛేదనలో రోహిత్ శర్మ (0) తొలి ఓవర్‌లోనే వెనుదిరిగినా కోహ్లీ ఏమాత్రం ఒత్తిడికి లోనుకాలేదు. తనదైన కవర్ డ్రైవ్‌లు, మిడ్ వికెట్ షాట్లతో అలరించాడు. 51 బంతుల్లో 13 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 74 పరుగులు చేశాడు. ఇది అతడికి 80వ వన్డే అర్ధశతకం. కెప్టెన్ శుభ్ మన్ గిల్ (37)తో కలిసి రెండో వికెట్‌కు 113 పరుగులు జోడించి విజయానికి బాటలు వేశాడు. వర్షం పలుమార్లు ఆటకు అంతరాయం కలిగించినా కోహ్లీ జోరు తగ్గలేదు.

కివీస్‌కు గర్నూర్ షాక్

పవర్‌ప్లేలోనే అర్ష్‌దీప్ రెండు వికెట్లు తీసి కివీస్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. ఆ తర్వాత రంగంలోకి దిగిన గర్నూర్.. విల్ యంగ్, టామ్ లాథమ్ సహా మూడు వికెట్లు పడగొట్టాడు. లాథమ్‌ను తన రిఫ్లెక్స్ క్యాచ్‌తో వెనక్కి పంపడం మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. టిమ్ సీఫెర్ట్ (38), డారిల్ మిచెల్ (28), గ్లెన్ ఫిలిప్స్ (30) కాస్త ప్రతిఘటించినా భారత బౌలర్ల ధాటికి కివీస్ కోలుకోలేకపోయింది. మిచెల్‌ను రనౌట్ చేయడంలో రోహిత్ చురుకుదనం, కేఎల్ రాహుల్ వేగం కీలకమయ్యాయి. నాథన్ స్మిత్‌ను ఔట్ చేసేందుకు కోహ్లీ అందుకున్న అద్భుత క్యాచ్ కూడా ఆకట్టుకుంది.

అదరగొట్టిన భారత్

సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 8–1తో ఘన విజయం

- లక్ష్మణ్ లక్రా, దిల్‌ప్రీత్ సింగ్ రెండేసి గోల్స్
- ఏడోసారి టైటిల్ పోరుకు అర్హత • నేడు జపాన్‌తో ఫైనల్

మొహాలీ: ఆసియా చాంపియన్స్ ట్రోఫీ పురుషుల హాకీ టోర్నీలో భారత జట్టు అదరగొట్టింది. సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై గోల్స్ వర్షం కురిపించింది. బుధవారం జరిగిన రెండో సెమీఫైనల్లో 8–1తో ఘన విజయం సాధించి ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన భారత్ ఈ టోర్నీ ఫైనల్‌కు చేరడం ఇది ఏడోసారి కావడం విశేషం. గురువారం జరిగే తుది పోరులో జపాన్‌తో తలపడనుంది. భారత్ తరఫున షిలానంద్ లక్రా (4, 13వ నిమిషాలు), దిల్‌ప్రీత్ సింగ్ (21, 25) రెండేసి గోల్స్‌తో మెరిశారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (9), సుఖ్‌జీత్ సింగ్ (21), అంగద్ బీర్ సింగ్ (36), వివేక్ సాగర్ ప్రసాద్ (54) ఒక్కో గోల్ సాధించారు. కొరియా తరఫున సంగ్‌జున్ హాన్ (9) ఏకైక గోల్ చేశాడు. తొలి రెండు క్వార్టర్లలోనే భారత్ 6–1 ఆధిక్యం సాధించి ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది.

ఐదు నిమిషాల్లో మూడు గోల్స్

నాలుగో నిమిషంలో లక్రా ఫీల్డ్ గోల్‌తో భారత్ ఖాతా తెరిచింది. తొమ్మిదో నిమిషంలో కొరియా సమం చేసినా.. అదే నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ గోల్‌గా మలిచాడు. 13వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ రీబౌండ్‌ను లక్రా గోల్‌గా మలిచి ఆధిక్యాన్ని పెంచాడు. రెండో క్వార్టర్‌లో సుఖ్‌జీత్, దిల్‌ప్రీత్ వరుసగా గోల్స్ సాధించారు. 25వ నిమిషంలో మరో గోల్ చేసిన దిల్‌ప్రీత్ తన ఖాతాలో రెండో గోల్ వేసుకున్నాడు. దీంతో తొలి అర్ధభాగం ముగిసే సరికి భారత్ 6–1తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది.

జపాన్‌తో తుది సమరం

మూడో క్వార్టర్‌లో అంగద్ బీర్ సింగ్, చివరి క్వార్టర్‌లో వివేక్ సాగర్ ప్రసాద్ గోల్స్‌తో భారత్ విజయాన్ని 8–1కు చేర్చింది. మ్యాచ్‌లో భారత్‌కు నాలుగు పెనాల్టీ కార్నర్లు లభించగా.. కొరియాకు ఒక్కటీ దక్కలేదు. అంతకుముందు జరిగిన తొలి సెమీఫైనల్లో జపాన్ పెనాల్టీ షూటౌట్‌లో 5–3తో మలేసియాను ఓడించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు గోల్స్ చేయలేకపోయాయి. లీగ్ దశలోనూ అజేయంగా నిలిచిన భారత్.. ఐదు మ్యాచ్‌ల్లోనూ విజయాలు సాధించి అగ్రస్థానంతో సెమీస్‌కు చేరింది. కొరియాను లీగ్ దశలోనూ 8–0తో చిత్తు చేసింది.





ఏమాయా చేసావే!

టెన్నిస్‌లో చరిత్ర సృష్టించిన రాజేశ్వరన్ రేవతి

- చెన్నై ఓపెన్‌లో పోలిష్ క్రీడాకారిణిపై వరుస సెట్ల విజయం
- డబ్ల్యూటీఏ టూర్ సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్‌కు అర్హత
- 14 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన 17 ఏళ్ల భారత సంచలనం
- సానియా తర్వాత ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళగా రికార్డు

చెన్నై: భారత మహిళా టెన్నిస్‌లో యువ సంచలనం మాయా రాజేశ్వరన్ రేవతి చరిత్ర సృష్టించింది. డబ్ల్యూటీఏ టూర్ స్థాయి సింగిల్స్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌కు చేరిన భారత క్రీడాకారిణిగా నిలిచింది. 2012 ఫిబ్రవరిలో సానియా మీర్జా తర్వాత ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళగా రికార్డులకెక్కింది. బుధవారం జరిగిన చెన్నై ఓపెన్ రెండో రౌండ్‌లో ప్రపంచ 277వ ర్యాంకర్, పోలాండ్‌కు చెందిన వెరోనికా ఫాల్కోవ్‌స్కాపై 6–4, 6–3తో వరుస సెట్లలో విజయం సాధించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 669వ స్థానంలో ఉన్న 17ఏళ్ల మాయా అద్భుత ఆటతీరుతో ఈ ఘనత అందుకుంది. చివరిసారిగా 2012లో థాయ్‌లాండ్ ఓపెన్‌లో సానియా మీర్జా డబ్ల్యూటీఏ టూర్ సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. అప్పటి నుంచి ఈ స్థాయి టోర్నీలో భారత మహిళకు చివరి ఎనిమిది మంది దశకు చేరడం సాధ్యం కాలేదు. ఆ నిరీక్షణకు మాయా తెరదించింది. గత రెండు సీజన్లలో చెన్నై ఓపెన్‌లో ఏ భారత క్రీడాకారిణీ రెండో రౌండ్ దాటి ముందుకు వెళ్లలేకపోయింది. ఈసారి మాయా ఆ అడ్డంకినీ అధిగమించింది.

ఈ ఏడాది వరుస విజయాలు

ఈ ఏడాది ప్రొఫెషనల్ టెన్నిస్‌లో మాయా వేగంగా ఎదుగుతోంది. అక్టోబరులో పోర్చుగల్‌లో జరిగిన డబ్ల్యూ35 సింగిల్స్ టోర్నీలో క్వాలిఫయర్‌గా బరిలోకి దిగి ఒక్క సెట్ కూడా కోల్పోకుండా తొలి టైటిల్‌ను సాధించింది. ఉక్రెయిన్ క్రీడాకారిణి యెలిజవెటా కోట్లియార్‌తో కలిసి డబుల్స్ టైటిల్‌నూ గెలుచుకుంది. సానియా తర్వాత ప్రొఫెషనల్ సింగిల్స్ టైటిల్ సాధించిన అతి పిన్న వయస్కురాలైన భారత క్రీడాకారిణిగా నిలిచింది. ఇటీవల స్పెయిన్‌లోని రఫెల్ నాదల్ అకాడమీ నుంచి ఫ్రాన్స్‌లోని ఎలైట్ టెన్నిస్ సెంటర్‌కు మారింది.

తప్పిదాలను అధిగమించి..

ఫాల్కోవ్‌స్కాతో పోరులో ఇరువురు క్రీడాకారిణులు డబుల్ ఫాల్ట్‌లు, అనవసర తప్పిదాలతో ఇబ్బందిపడ్డారు. ఆరంభంలో సర్వీస్ కోల్పోయిన మాయా వెంటనే బ్రేక్ సాధించి పోటీలోకి వచ్చింది. తొలి సెట్‌లో వరుసగా ఐదు సార్లు సర్వీస్ బ్రేక్ కాగా.. కీలక సమయంలో మాయా పైచేయి సాధించి 6–4తో సెట్ కైవసం చేసుకుంది. రెండో సెట్‌లోనూ దూకుడుగా ఆడుతూ ఎనిమిదో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసింది. 5–3 ఆధిక్యంలోకి వెళ్లిన మాయా, మూడో మ్యాచ్ పాయింట్ వద్ద విజయాన్ని ఖాయం చేసుకుంది.

డబుల్స్‌లో మిశ్రమ ఫలితాలు

మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో వైష్ణవి అడ్కర్–రుతుజా భోసలే జోడీ 6–4, 6–4తో మాడెలిన్ బ్రూక్స్–అమీలియా రాజికీ జంటపై గెలిచింది. మరోవైపు దియా రమేశ్–డి. వినయగామూర్తి జోడీ 2–6, 2–6తో నహియా కరమోకో–సిమోనా వాల్టర్ జంట చేతిలో ఓడింది. అంకితా రైనా–హిరోకో కువాటా జోడీ కూడా 1–6, 1–6తో జార్జినా డా సిల్వా ఫిక్–జిబెక్ కులంబయేవా జంట చేతిలో పరాజయం పాలైంది.

జనవరి 14 నుంచి డబ్ల్యూపీఎల్

- ఐదో సీజన్‌కు ఆతిథ్యమివ్వనున్న వడోదర, ముంబై
- రెండు వేదికల్లో 11 మ్యాచ్‌ల చొప్పున నిర్వహణ
- ఆరంభ పోరులోనే డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరుతో ముంబై ఢీ
- షెడ్యూల్ ఖరారు చేసిన బీసీసీఐ

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఐదో సీజన్‌కు రంగం సిద్ధమైంది. 2027 జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు వడోదర, ముంబై వేదికలుగా ఈ టోర్నీ జరగనుంది. రెండు నగరాల్లోనూ 11 మ్యాచ్‌ల చొప్పున నిర్వహించనున్నట్లు బీసీసీఐ బుధవారం ప్రకటించింది. పూర్తి షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), రెండుసార్లు విజేత ముంబై ఇండియన్స్ తలపడ నున్నాయి. వడోదరలోని కొటాంబిలో కొత్తగా నిర్మించిన బీసీఏ స్టేడియంలో జనవరి 14 నుంచి 24 వరకు తొలి దశ మ్యాచ్‌లు జరుగుతాయి. అనంతరం జనవరి 26 నుంచి ముంబైలోని బ్రబోర్న్ స్టేడియానికి టోర్నీ తరలుతుంది. లీగ్ దశ ఫిబ్రవరి 3 వరకు కొనసాగుతుంది. అన్ని మ్యాచ్‌లూ రాత్రి 7.30 గంటలకు ప్రారంభమవుతాయి.

ఫిబ్రవరి 5న ఎలిమినేటర్

పాయింట్ల పట్టికలో రెండో, మూడో స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఫిబ్రవరి 5న ఎలిమినేటర్ మ్యాచ్ నిర్వహిస్తారు. అగ్రస్థానంలో నిలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధి స్తుంది. ఫిబ్రవరి 7న బ్రబోర్న్ స్టేడియంలో తుదిపోరు జరగ నుంది. గత సీజన్ నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడి యం, వడోదరలో జరిగింది. ప్రస్తుతం డీవై పాటిల్ స్టేడియంలో పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి.



2028లో రామాయణ రెండో భాగం

- భారీ విజువల్ అద్భుతం కోసం మరింత సమయం
- నిర్మాత నమిత్ మల్హోత్రా వెల్లడి

ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్న చిత్రం 'రామాయణ'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ భారీ ప్రాజెక్టులో తొలి భాగం నవంబరు 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్‌లో మంచి స్పందన లభిస్తోంది. అయితే, రెండో భాగం విడుదల విషయంలో చిత్ర నిర్మాత నమిత్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 2027 దీపావళికి రావాల్సిన పార్ట్–2ను 2028లో విడుదల చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన నమిత్.. తొలి భాగం కోసం ఎంతో శ్రమించినట్లుగానే రెండో భాగాన్ని కూడా అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు మరింత సమయం అవసరమని పేర్కొన్నారు. 'రామాయణ తొలి భాగంపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తిని మేం గమనిస్తున్నాం. రెండో భాగం విషయంలో తొందరపడాలని అనుకోవడం లేదు. ఈ భారీ చిత్రానికి పూర్తి న్యాయం చేయాలంటే అదనంగా ఏడాది సమయం తీసుకోవడం తప్పు కాదు. ప్రేక్షకులు రెండో భాగాన్ని చూసినప్పుడు ఓ అద్భుతాన్ని వీక్షించిన అనుభూతి పొందాలి. నాణ్యత విషయంలో రాజీపడకుండా అత్యుత్తమ రూపంలో సినిమాను తీసుకు రావడమే మా లక్ష్యం' అని వివరించారు. వాస్తవానికి 'రామాయణ'ను తొలుత మూడు భాగాలుగా తెరకెక్కించాలని భావించినట్లు నమిత్ తెలిపారు. కథ, కథనాలపై విస్తృతంగా చర్చించిన అనంతరం రెండు భాగాలకే పరిమితం చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. తొలి భాగానికి ప్రేక్షకుల నుంచి వచ్చే స్పందనను బట్టి రెండో భాగంలో అవసరమైన మార్పులు, చేర్పులు చేసే అవకాశం ఉందని వెల్లడించారు.

అల్లు అర్జున్ శుభాకాంక్షలు

తొలి భాగం విడుదల సందర్భంగా చిత్ర బృందానికి నటుడు అల్లు అర్జున్ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం నేడు (గురువారం) విడుదల కానుంది.



ఆర్‌సీ17కు చిరు క్లాప్

మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో మరో భారీ చిత్రం పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. 'ఆర్‌సీ17' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమా ఇటీవల పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన మెగాస్టార్ చిరంజీవి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ డిసెంబరు నుంచి ప్రారంభం కానుంది. గతంలో రామ్‌చరణ్, సుకుమార్ కలయికలో వచ్చిన 'రంగస్థలం' ఘన విజయాన్ని అందుకోవడంతో ఈ తాజా ప్రాజెక్టుపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మరోసారి ఈ ఇద్దరూ కలిసి పని చేస్తుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. చిత్రంలోని ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. కాగా, సినిమా పూజా కార్యక్రమాలకు సంబంధించిన ప్రత్యేక ప్రోమోను చిత్ర నిర్మాణ సంస్థ తాజాగా విడుదల చేసింది.

హీరోయిన్లకూ కటౌట్లు రావడం మంచి మార్పు



హీరోలకు మాత్రమే పరిమితమైన భారీ కటౌట్ల సంప్రదాయం ఇప్పుడు హీరోయిన్లకూ విస్తరించడం మంచి పరిణామమని నటి రెజీనా అన్నారు. 'మాకుత్తి అమ్మన్–2' (తెలుగులో 'మహాశక్తి') విడుదల సందర్భంగా నయనతారకు 60 అడుగుల కటౌట్ ఏర్పాటు చేయడంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. హీరోయిన్లకూ హీరోలతో సమానంగా గుర్తింపు, గౌరవం దక్కాలని అభిప్రాయపడ్డారు. ఈ సినిమాలో తొలిసారి ప్రతినాయికగా నటిస్తున్నానని, విభిన్నమైన పాత్రలు చేయడం కొత్త అనుభూతినిస్తోందని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. తక్కువ సినిమాలు చేసినా మంచి పాత్రలనే ఎంచుకోవాలనుకుంటున్నట్లు చెప్పారు.



దలాల్ స్ట్రీట్‌లో దివాళీ జోష్

వరుసగా ఐదో రోజూ లాభాల్లో ముగిసిన మార్కెట్లు

- 77 వేల ఎగువకు సెన్సెక్స్.. మరో 384 పాయింట్ల లాభం
- 23,960 స్థాయికి చేరిన నిఫ్టీ
- ఐదు రోజుల్లో సెన్సెక్స్ 4,055 పాయింట్లు.. నిఫ్టీ 1,261 పాయింట్ల ర్యాలీ
- విదేశీ పెట్టుబడుల ప్రవాహం, ముడిచమురు ధరల తగ్గుదలతో ఉత్సాహం

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లలో జోరు కొనసాగుతోంది. విదేశీ పెట్టుబడుల ప్రవాహం, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు తగ్గడం, ఆర్థిక, ఎఫ్‌ఎంసీజీ, ఆటోమొబైల్ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు వరుసగా ఐదో రోజూ లాభాల్లో ముగిశాయి. బుధవారం బీఎస్ఈ సెన్సెక్స్ 383.55 పాయింట్లు (0.50 శాతం) పెరిగి 77,301.40 వద్ద స్థిరపడింది. ఇది రెండు నెలలకు పైగా కాలంలో అత్యధిక ముగింపు స్థాయి. ఇంట్రాడేలో 478.19 పాయింట్లు ఎగబాకి 77,396.04ను తాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 149.75 పాయింట్లు (0.63 శాతం) లాభపడి 23,960.60 వద్ద ముగిసింది.

ఐదు రోజుల్లో 5.5 శాతం వృద్ధి

గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 4,055.37 పాయింట్లు (5.53 శాతం), నిఫ్టీ 1,261.75 పాయింట్లు (5.55 శాతం) చొప్పున పుంజుకున్నాయి. బుధవారం సెన్సెక్స్ 30 షేర్లలో భారత్ ఎలక్ట్రానిక్స్, టైటాన్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, బజాజ్ ఫైనాన్స్, ఐటీసీ, అదానీ పోర్ట్స్ అత్యధిక లాభాలు నమోదు చేశాయి. టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, ఎటర్నల్ నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 2.40 శాతం, మిడ్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 0.81 శాతం పెరిగాయి.



విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) మంగళవారం రూ.6,836.81 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర 0.73 శాతం తగ్గి బ్యారెల్ 102.8 డాలర్లకు చేరింది. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు ప్రపంచ మార్కెట్లలో సానుకూల వాతావరణానికి దోహదం చేశాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ తెలిపారు. వాణిజ్య సుంకాల విధానంలో అమెరికా మరింత సంయమనంతో వ్యవహరించవచ్చన్న అంచనాలు, మెరుగైన త్రైమాసిక ఫలితాలు, పండగల సీజన్‌లో వినియోగం పెరగడం కూడా మార్కెట్లకు ఊతమిచ్చాయని పేర్కొన్నారు.

ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి

బీఎస్ఈ రంగాల సూచీల్లో రియల్టీ 2.83 శాతం, ఆసుపత్రులు 2.70 శాతం, విద్యుత్ 2.64 శాతం, మెటల్స్ 2.48 శాతం, పారిశ్రామిక రంగం 2.34 శాతం లాభపడ్డాయి. ఐటీ సూచీ మాత్రం 1.21 శాతం నష్టపోయింది. కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో పెరుగుతున్న వ్యయాలు, అమెరికా ఎన్నికల తర్వాత నియంత్రణపరమైన పరిశీలనలు పెరగవచ్చన్న ఆందోళనలతో ఆసియా టెక్నాలజీ షేర్లలో అమ్మకాలు చోటు చేసుకున్నాయని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగాధిపతి సిద్ధార్థ ఖేమ్కా వివరించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, దౌత్యపరమైన పరిణామాలు ముడిచమురు ధరలు, అంతర్జాతీయ మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయని విశ్లేషించారు.ఆసియా మార్కెట్లలో జపాన్ నిక్కీ నష్టాల్లో ముగియగా, దక్షిణ కొరియా కోస్పి, చైనా షాంఘై, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ లాభపడ్డాయి. ఐరోపా మార్కెట్లు సానుకూలంగా కదిలాయి.

జియో కొత్త ప్లాన్

- రూ.15కే అన్‌లిమిటెడ్ 5జీ డేటా

న్యూఢిల్లీ: ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో కొత్త డేటా ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. కేవలం రూ.15కే అన్‌లిమిటెడ్ హైస్పీడ్ 5జీ డేటాను అందిస్తోంది. అంటే ఈ ప్లాన్‌లో ఎలాంటి వాయిస్ కాల్స్ సౌకర్యం ఉండదు. వేగవంతమైన డేటా కావాలనుకునే వినియోగదారులకు ఈ ప్లాన్ ఉపయోగపడుతుంది. ఈ ప్లాన్ వ్యాలిడిటీ 24 గంటలు లేదా ఒకరోజు. ఆన్‌లైన్ గేమింగ్, పెద్ద వీడియోల డౌన్‌లోడ్స్, రిమోట్ వర్క్, వీడియో స్ట్రీమింగ్ కోసం హైస్పీడ్ డేటా కోరుకునే వారికి ఈ ప్లాన్ ఉపయోగకరం. ఈ డేటాను మొబైల్ వైఫై హాట్‌స్పాట్ ద్వారా ఇతర డివైజ్‌లకు కూడా కనెక్ట్ చేసుకోవచ్చు. దేశంలోని అన్ని టెలికామ్ సర్కిళ్లలో ఈ ప్లాన్ అందుబాటులోకి వచ్చింది. మై జియో యాప్, జియో అధికారిక వెబ్‌సైట్, సంబంధిత రిటైలర్ ప్లాట్‌ఫాంల ద్వారా రీఛార్జ్ చేసుకోవచ్చు. మరోవైపు, ట్రాయ్ నిబంధనలకు అనుగుణంగా జియో ఇటీవల వాయిస్ ఓన్లీ ప్లాన్లను కూడా అందుబాటులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. వీటిలో ఎలాంటి డేటా ప్రయోజనాలు లేకుండా 22 రోజుల వ్యాలిడిటీతో రూ.147 ప్రారంభ ధర నుంచి ఈ ప్లాన్‌లను పరిచయం చేసింది.

టాటా మోటార్స్ యాప్‌లలో భద్రతా లోపాలు!

- ఐఆర్ఏ 2.0, ఐఆర్ఏ. ఈవీ యాప్‌లకు సీఈఆర్‌టీ–ఇన్ హెచ్చరిక
- వినియోగదారుల వ్యక్తిగత సమాచారం చోరీ అయ్యే ప్రమాదం
- అనధికారికంగా వాహన వివరాలు పొందే అవకాశం
- తాజా వెర్షన్లకు అప్‌డేట్ చేసుకోవాలని సూచన

న్యూఢిల్లీ: టాటా మోటార్స్‌కు చెందిన కనెక్టెడ్ వెహికల్ యాప్‌లలో భద్రతా లోపాలు ఉన్నట్లు ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సీఈఆర్‌టీ–ఇన్) గుర్తించింది. ఐఆర్ఏ 2.0, ఐఆర్ఏ.ఈవీ యాప్‌లలోని కొన్ని వెర్షన్లలో ఉన్న నాలుగు రకాల లోపాల కారణంగా వినియోగదారుల వ్యక్తిగత సమాచారం, వాహన వివరాలు హ్యాకర్ల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ ముప్పును 'హై' స్థాయిగా వర్గీకరించింది.
టాటా మోటార్స్ ఐఆర్ఏ 2.0 యాప్ 26.7.3, అంతకంటే పాత వెర్షన్లు, ఐఆర్ఏ.ఈవీ యాప్ 26.7.2, అంతకంటే పాత వెర్షన్లు ఈ ముప్పు పరిధిలో ఉన్నట్లు సీఈఆర్‌టీ–ఇన్ వెల్లడించింది. వినియోగదారులు ఐఆర్ఏ 2.0 వెర్షన్ 26.8.2, ఐఆర్ఏ.ఈవీ వెర్షన్ 26.9.1కు అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. ఈ లోపాలను ఆసరాగా చేసుకుని హ్యాకర్లు వినియోగదారులుగా నటించడం, వారి ఖాతాల్లోకి చొరబడటం, సమాచారాన్ని అనధికారికంగా మార్చడం వంటివి చేసే అవకాశం ఉందని పేర్కొంది.



నాలుగు రకాల భద్రతా లోపాలు

యాప్‌లలో భద్రతా ప్రమాణాలు సరిగా లేకపోవడమే ఈ సమస్యలకు కారణమని సీఈఆర్‌టీ–ఇన్ వివరించింది. యాప్‌లలోనే నిక్షిప్తం చేసిన సర్వీస్ ఖాతాల వివరాలు, ఏపీఐ కీలు, అనుమతి టోకెన్లను హ్యాకర్లు సేకరించి సర్వర్ల లోకి చొరబడే అవకాశం ఉంది. అలాగే వెబ్‌వ్యూ ద్వారా తెరిచే వెబ్ చిరునామాల ధ్రువీకరణ సరిగా లేకపోవడంతో వినియోగదారుల లాగిన్ వివరాలు తస్కరించే ప్రమాదం ఉంది. మరోవైపు, యాప్ లాగ్‌లలోనే ప్రామాణీకరణ టోకెన్లు నమోదవుతుండటం వల్ల వాటిని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని హెచ్చరించింది. సురక్షిత సమాచార మార్పిడికి ఉపయోగించే ఎస్ఎస్ఎల్ సర్టిఫికెట్ పిన్నింగ్ విధానంలోనూ లోపాలున్నాయని తెలిపింది. దీంతో యాప్‌లు, వాటి సర్వర్ల మధ్య జరిగే సమాచార మార్పిడిని హ్యాకర్లు మధ్యలోనే అడ్డుకుని, సమాచారాన్ని చదవడం లేదా మార్చడం సాధ్యమవుతుందని పేర్కొంది. ఈ యాప్‌ల ద్వారా వాహన స్థితిగతులు, ఆరోగ్య పరిస్థితి, ప్రయాణ వివరాలు, రిమోట్ ఆదేశాలను వినియోగదారులు తెలుసుకునే సదుపాయం ఉంది. ఈ నేపథ్యంలో తాజా వెర్షన్లకు అప్‌డేట్ చేసుకోవడం అత్యవసరమని సూచించింది.

పెట్టుబడికి గడువు దాటిందా?

- హెచ్‌డీఎఫ్‌సీలో పన్ను ఆదా అవకాశం
- 1988 పథకం కింద డిపాజిట్ల స్వీకరణకు కేంద్రం అనుమతి
- పన్ను మినహాయింపుతో పాటు డిపాజిట్లపై వడ్డీ ఆదాయం
- గరిష్ఠంగా మూడేళ్లపాటు నగదు నిల్వ చేసుకునే అవకాశం

న్యూఢిల్లీ: క్యాపిటల్ గెయిన్స్ అకౌంట్స్ స్కీమ్ (సీజీఏఎస్)–1988 కింద డిపాజిట్లను స్వీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించినట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించింది. ఈ పథకం ద్వారా ఆస్తుల విక్రయంపై వచ్చిన మూలధన లాభాలను తిరిగి పెట్టుబడి పెట్టేందుకు గడువులోగా నిర్ణయం తీసుకోలేని పన్ను చెల్లింపుదారులు తమ నగదును బ్యాంకు ఖాతాల్లో గరిష్ఠంగా మూడేళ్లపాటు ఉంచుకోవచ్చు.



పన్ను మినహాయింపుతో వడ్డీ ఆదాయం

ఈ సదుపాయం కింద హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పట్టణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లోని అన్ని శాఖల్లో (గ్రామీణ శాఖలు మినహా) పొదుపు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు ప్రారంభించవచ్చని బ్యాంకు తెలిపింది. ఆదాయపు పన్ను చట్టంలోని నిబంధనల ప్రకారం అర్హత కలిగిన పన్ను చెల్లింపుదారులు మూలధన లాభాలపై పన్ను మినహాయింపు పొందడంతోపాటు, డిపాజిట్ చేసిన మొత్తంపై మూడేళ్ల వరకు వడ్డీ ఆదాయాన్ని కూడా పొందవచ్చని వివరించింది.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.